RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PUBLISHED FROM: HYDERABAD | సంపుటి: 00 | సంచిక: 0 | ఆదివారం, 01 డిసెంబర్, 2024 | ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న | అసోసియేట్ ఎడిటర్: కే రాజేంద్ర ప్రసాద్ | పేజీలు: 08 వెల: 2 రూ/-



సీఎం రేవంత్ రెడ్డి తో మర్యాద పూర్వకంగా భేటీ అయిన ఆస్ట్రియా రాయబారి కేథరినా వేజర్.సమావేశంలో పాల్గొన్న నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.

## జార్ఖండ్ గెలుపు మార్గదర్శికి..

### కాంగ్రెస్ శ్రేణుల సంబరోత్సాహాల స్వాగతం

జార్ఖండ్ శాసనసభకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అధిష్టాన నమ్మకాన్ని నిలబెడుతూ.. అక్కడి ప్రజల మనోభావాలకు అనుగుణంగా ఇండియా కూటమి ఘన విజయానికి బలమైన పునాదులేసిన వ్యూహ చాణక్యుడు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క. జార్ఖండ్ లో కూటమి ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేశాక.. ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పాల్గొని.. రాష్ట్రానికి తిరిగి వచ్చిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టులో ఘన స్వాగతం పలికిన రాష్ట్ర కాంగ్రెస్ శ్రేణులు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు స్వాగతం పలికింది వారిలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గ ప్రసాద్, ఖమ్మం నగర కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ జావేద్, కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, కార్పోరేషన్ చెర్మన్ పోడెం



వీరయ్య, కార్పొరేషన్ చెర్మన్లు నాయుడు సత్యనారాయణ, రాయల నాగేశ్వర రావు, పలువురు కార్పొరేటర్లు, వివిధ జిల్లాల, మండలాల ముఖ్య కాంగ్రెస్ నాయకులు, మహిళ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. కాంగ్రెస్ శ్రేణులు భారీ ఎత్తున ఈ స్వాగత కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కృష్ణా, గోదావరి జలాల్లో మన వాటాలు దక్కించుకుందాము

- ♦ ఆ మేరకు ట్రిబ్యునల్ ముందు వాదనలు వినిపించండి
- ♦ ఉన్నతాధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు

హైదరాబాద్ : కృష్ణా, గోదావరి జలాల్లో రాష్ట్రానికి రావాల్సిన నీటి వాటాలను దక్కించుకోవాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. తెలంగాణ ప్రయోజనాలకు వీసమెత్తు నష్టం వాటిల్లకుండా ట్రిబ్యునల్ ఎదుట సమర్థవంతమైన వాదనలు వినిపించాలని ఆదేశించారు. అందుకు అవసరమైన సాక్ష్యాధారాలు, రికార్డులు, ఉత్తర్వులు సిద్ధంగా ఉంచుకోవాలని నీటిపారుదల శాఖ అధికారులను, న్యాయ నిపుణులను అప్రమత్తం చేశారు. ఇరిగేషన్ ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో సాగునీటి పరిస్థితి, కృష్ణా గోదావరి జలాలపై ఉన్న అంతరాష్ట్ర వివాదాలు, నీటి వాటాల పంపిణీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర పునర్వ్యవస్తీకరణ చట్టం ప్రకారం రెండు రాష్ట్రాల నీటి వాటాలు, ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులను బ్రజేష్కుమార్ ట్రిబ్యునల్ నిర్ణయించాల్సి ఉంది. ట్రిబ్యునల్ ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అభిప్రాయాలను, ఆధారాలను మాత్రమే సేకరించింది. త్వరలోనే ట్రిబ్యునల్ ఎదుట రాష్ట్రాలు తమ వాదనలు వినిపించాల్సి ఉంటుందని, ఆ తర్వాత ట్రిబ్యునల్ నిర్ణయం వెలువడుతుందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. కృష్ణా పరివాహక ప్రాంతానికి సంబంధించి ఇప్పటివరకు ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పులు, ఏయే ప్రాజెక్టులకు సంబంధించిన డీపీఆర్లను ఇప్పటికే ట్రిబ్యునల్కు సమర్పించారు.. జలశక్తి మంత్రిత్వ శాఖకు ఇచ్చిన నివేదికలన్నింటినీ వరుస క్రమంలో సిద్ధంగా ఉంచుకోవాలని, వాటి ఆధారంగా ట్రిబ్యునల్ ఎదుట పకడ్బందీగా వాదనలు వినిపించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు, అంతర్జాతీయ నీటి సూత్రాల ప్రకారం నదీ పరివాహక ప్రాంతాన్ని బట్టి అదే దామాషా ప్రకారం నీటి కేటాయింపులుండాలి. కృష్ణా పరివాహక ప్రాంతం తెలంగాణలో 70 శాతం ఉండగా.. ఏపీలో కేవలం 30 శాతం ఉంది. అదే వాదనల ప్రకారం 1005 టీఎంసీల్లో 70 శాతం నీటి వాటా తెలంగాణకు దక్కేలా వాదనలు వినిపించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. పోలవరం ద్వారా 80 టీఎంసీల గోదావరి జలాలను ఏపీ కృష్ణా డెల్టాకు వినియోగిస్తున్నందున, వాటికి



బదలెగా నాగార్జునసాగర్ ఎగువన 45 టీఎంసీలు తెలంగాణకు నీటి కేటాయింపులున్న విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ఆ నీటి వాటాను ఎగువన ఉన్న ప్రాజెక్టుల ద్వారా వినియోగించుకునే ప్రణాళికను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. బ్రజేష్కుమార్ ట్రిబ్యునల్ నీటి వాటాల పంపిణీ ఇప్పటివరకు పూర్తి చేయనందున, కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీల నిర్ణయాలను ఎందుకు పట్టించుకోవాలని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ట్రిబ్యునల్ నీటి వాటాల పంపిణీ పూర్తయ్యేవరకు గోదావరి, కృష్ణా బోర్డుల జోక్యం ఉండకూడదని సుప్రీం కోర్టులో వాదనలు వినిపించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. వివిధ ప్రాజెక్టుల ద్వారా కృష్ణా జలాల్లో కోటాకు మించి ఎక్కువ నీటిని ఏపీ తరలిస్తోందని చర్చ జరిగింది. నీటి ప్రవాహాన్ని శాస్త్రీయంగా లెక్కించే టెలీ మెట్రీ విధానంతో దీనికి అడ్డుకట్ట వేసే వీలుందని అధికారులు సీఎంకు వివరించారు. టెలీ మెట్రీ పరికరాలకయ్యే రూ.12 కోట్లు రెండు రాష్ట్రాలు చెరి సగం చెల్లించాలని అధికారులు సీఎంకు వివరించారు. అవసరమైతే మొత్తం డబ్బులు ముందుగా భరించి టెలీమెట్రీ అమల్లోకి తీసుకురావాలని, ఏపీ ఇచ్చినప్పుడు రీయింబర్స్ చేసుకోవాలని సీఎం సూచించారు. నీటి వినియోగం విషయంలో జరుగుతున్న అన్యాయానికి అడ్డుకట్ట వేయాలని అధికారులను ఆదేశించారు. కృష్ణాపై ఉన్న ప్రాజెక్టులన్నింటి ద్వారా ఏ రాష్ట్రం ఎన్ని నీళ్లు వాడుకుంటుందో లెక్కలు తీయాలని ఆదేశించారు. శ్రీశైలం, పోతిరెడ్డిపాడు, బంకచెర్ల హెడ్ రెగ్యులేటరీ, తెలుగు గంగ, కేసీ కెనాల్, హంద్రీ నివా, గాలేరు నగరి, వెలుగోడు ప్రాజెక్టుల నుంచి ఎంత నీటిని తరలిస్తున్నారనే వివరాలన్నీ రికార్డు చేయాలని చెప్పారు. సీతారామ ప్రాజెక్టు, సమ్మక్క బ్యారేజీకి అవసరమైన అనుమతులు తీసుకోవాలని, పూర్తి ఆయకట్టుకు నీరందించేందుకు అవసరమైన పనులన్నీ తొందరగా చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టులు, నీటి వాటాలకు సంబంధించి సమర్థంగా వాదనలు వినిపించేందుకు 2014 నుంచి ఇప్పటివరకు ఉన్న జీవోలు, తీర్పులే కాకుండా.. ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన జీవోలు, మెమోలు, ప్రాజెక్టుల డీపీఆర్లు, అప్పటి నుంచి నీటి వాటాల్లో తెలంగాణకు జరిగిన నష్టాలపై సమగ్రంగా నివేదిక తయారు చేయాలని ఆదేశించారు. వీటి ఆధారంగా అన్ని వేదికలపై తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించేలా సమర్థమైన వాదనలు వినిపించాలని సూచించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు మంత్రి ఉత్తమ్కుమార్ రెడ్డి, స్టాండింగ్ కౌన్సిల్ వైద్యనాథన్, ఏజీ సుదర్శన్రెడ్డి, అడిషనల్ ఏజీ రజనీకాంత్ రెడ్డి, ప్రభుత్వం తరఫు న్యాయవాది ఖుష్ వోరా, సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శేషాద్రి, సీఎం సెక్రెటరీ మాణిక్రాజ్, నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఇరిగేషన్ కార్యదర్శి ప్రశాంత్ పాటిల్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.



## గౌతమ్ అదానీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న ప్రధాని మోడీ

♦ లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ

కొజికోడ్ నవంబర్ 30: ప్రధాని నరేంద్ర మోడీ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ శనివారం ఆరోపించారు. "లోక్ సభలో వేము రాజకీయ సిద్ధాంతాలపై పోరాడుతున్నాము. వేమేమో అనుభూతులు, భావోద్వేగాలు, ప్రేమ వంటి వాటి గురించి మాట్లాడుతున్నాం. కానీ వారేమో విద్వేషం, క్రోధం, విభజన, హింస గురించి మాట్లాడుతున్నారు. అందరినీ సమానంగా చూడాలని రాజ్యాంగం చెబుతోంది. ఇతర భారతీయులకు భిన్నంగా అదానీని మాత్రం ప్రత్యేకంగా చూస్తామని ప్రధాని మోడీ అంటున్నారు'' అని రాహుల్ గాంధీ వాయనాడ్ లో జరిగిన బహిరంగ సభలో తెలిపారు.''అమెరికా అదానీని ఆరోపిని చేసినప్పటికీ, దోషిగా చేసినప్పటికీ అదేమంత విషయం కాదని మోడీ అంటున్నారు. మన దేశంలో మాత్రం అతడిని దోషిని చేయమంటున్నారు" అని రాహుల్ గాంధీ అన్నారు. లంచం కేసులో అమెరికా ప్రాసిక్యూటర్లు అదానీని దోషిగా తేల్చారు. ఆయనపై కేంద్రం కఠిన చర్యలు చేపట్టాలని కాంగ్రెస్, ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.రాహుల్ గాంధీ బిజెపి మీద దాడి చేస్తూ వారి వద్ద డబ్బు, ఇంటెలిజెన్స్ సంస్థలు, సిబిఐ, ఈడి, ఐటి వంటివన్నీ ఉన్నాయి. కానీ మా దగ్గర కేవలం ప్రజల భావోద్వేగాలున్నాయి. మేము బిజెపి సిద్ధాంతాలను ఓడిస్తామన్న విశ్వాసం మాకుంది" అన్నారు. "ప్రియాంక గాంధీ మీ పార్లమెంటు ప్రతినిధి. మీరామెను ఎన్నుకున్నారు.

ప్రజల్లో ఉన్న అభిమానం ప్రియాంక గాంధీని ఎంపీని చేసిందని నేను భావిస్తున్నాను" అంటూ రాహుల్ గాంధీ తెలిపారు.

# అంగన్ వాడీ కేంద్రాలకు పాల సరఫరాలో గ్యాప్ ఉండొద్దు

- 100 శాతం టార్గెట్ ను రీచ్ కావాలిసిందే
- మూడు నెలల సమయం ఇస్తున్నాం
- పాల సరఫరాను విజయ డెయిరీ మెరుగు పరుచుకోవాలి
- పోషకాహార తెలంగాణే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- ఆరోగ్య లక్ష్మీ పథకంపై మంత్రి సీతక్క సమీక్ష

హైదరాబాద్ : అంగన్ వాడీ కేంద్రాలకు చేసే పాల సరఫరాలో ఎటువంటి గ్యాప్స్ లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఆదేశాలు జారీచేసారు. మారు మూల ప్రాంతాల్లోని అంగన్ వాడీ కేంద్రాలను సకాలంలో పాల సరఫరా జరగాల్సిందేనని స్పష్టం చేసారు. పోషకాహర తెలంగాణ లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య లక్ష్మీ పథకం పై మంత్రి సీతక్క శనివారం నాడు సచివాలయంలో తన చాంబర్ లో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంగన్ వాడీ కేంద్రాలకు జరుగుతున్న పాల సప్లై పై మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ కాంతి వెస్లీ, ఇతర ఉన్నతాధికారులతో కలసి మంత్రి సీతక్క సమీక్షించారు. గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం అందించే లక్ష్యంతో ప్రభుత్వం ఆరోగ్య లక్ష్మీ పథకాన్ని అమలు చేస్తుంది. ఇందులో బాగంగా ప్రతి రోజ 200 ఎం ఎల్ పాలను గర్భిణీలు, బాలింతలకు అంగన్ వాడీ కేంద్రాల ద్వారా పంపిణి చేస్తారు. ప్రభుత్వ విజయ డెయిరీ టెట్రా ప్యాకెట్ల అంగన్ వాడీ కేంద్రాలకు సప్లై చేస్తుంది. గత డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు 1.67 కోట్ల లీటర్ల సరఫరా కోసం ఆర్డర్ చేయగా...1.56 కోటి లీటర్ల పాలను విజయా డెయిరీ సరఫరా చేయగలిగింది. అంటే 94 శాతం మేర సప్లై చేయగలిగింది. అయితే కొన్ని అంగన్ వాడీ సెంటర్లకు సకాలంలో పాలు సప్లై కాకపోవడం పట్ల మంత్రి సీతక్క సీరియస్ అయ్యారు. అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వం కోరినంత మేర పాలు సరఫరా చేయగలరా? లేదా?..అంత సామర్థ్యం ఉందా? లేదా? సరిపోయినంత సప్లై చేసే శక్తి లేకపోతే..మీ ఇండెంట్ ను తగ్గించి ఇతర సంస్థల ద్వారా సప్లై చేసుకోవాలా అని విజయ డెయిరీ ప్రతినిధులను మంత్రి సీతక్క ప్రశ్నించారు. మరో మూడు నెలల పాటు అవకాశం ఇస్తామని..పాల సరఫరా సంతృప్తికరంగా లేకపోతే ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వ విజయ డెయిరీ రైతుల నుంచి పాలను సేకరిస్తుందని...అందుకే రైతుల ప్రయోజనాలు కాపాడేందుకు విజయ డెయిరీ నుంచి పాలను కొనుగోలు చేస్తున్నామని గుర్తు చేసారు. రైతుల ప్రయోజనాలను కాపాడటంతో పాటు తమకు గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల సంరక్షణ అంతే ముఖ్యమని మంత్రి సీతక్క స్పష్టం చేసారు. అందుకే అంగన్ వాడీ కేంద్రాలకు జరిగే పాల సప్లై లో ఏలాంటి గ్యాప్స్ లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసారు. ఆరోగ్య తెలంగాణ, పోషకాహార తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని..ఆ లక్ష్యాన్ని చేరుకునే దిశగా పనిచేయాలని ఆదేశించారు. అంగన్వాడి కేంద్రాలకు సరఫరా అయ్యే పాల నాణ్యతను స్వయంగా రుచి చూసి మంత్రి సీతక్క పరిశీలించారు. పాల నాణ్యత పట్ల సంతృప్తి వ్యక్త పరిచారు. ప్రస్తుతం లీటర్ టెట్రా ప్యాక్ ను రూ.57 కి విజయ డెయిరీ సరఫరా చేస్తుంది. ధరలను సవరించాలని



విజయా డెయిరి ప్రతిపాదించగా..మంత్రి తిరస్కరించారు. మూడు నెలల పాటు ఏలాంటి గ్యాప్స్ లేకుండా పాలను సరఫరా చేసిన తర్వాత మరో సారి సమీక్షించి ధరల పెంపుపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసారు మంత్రి సీతక్క.





ములుగు నియోజకవర్గంలో కొత్తగా మల్లంపల్లి మండలాన్ని ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రత్యేకంగా కలిసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి సీతక్క, ములుగు డిసిసి అధ్యక్షులు పైడాకుల అశోక్



## టీడీపీలో చేరబోతున్న తీగల కృష్ణారెడ్డి.. డిసెంబర్ 3న ముహూర్తం ఫిక్స్!

హైదరాబాద్ నవంబర్ 30 : మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత తీగల కృష్ణారెడ్డి టీడీపీలో చేరబోతున్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని ఆయన ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా తెలుగుదేశం పార్టీలో చేరేందుకు ముహూర్తం ఫిక్స్ చేసుకున్నట్లు తెలుస్తోంది. డిసెంబర్ 3న ఆ పార్టీ చీఫ్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో కృష్ణారెడ్డి టీడీపీలో చేరనున్నారట. ఈ విషయాన్ని ఆయన మీడియాకు వెల్లడించారు.ఏపి ముఖ్యమంత్రి ప్రమాణం చేసిన అనంతరం హైదరాబాద్ కు వచ్చిన చంద్రబాబును మాజీ మంత్రి మల్లారెడ్డితోపాటు ఆయన కలిసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా టీడీపీలో చేరనున్నట్లు ప్రకటించారు. కాగా, 2014లో మహేశ్వరం నియోజకవర్గం నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన, అనంతరం బీఆర్ఎస్లో చేరారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్లో చేరారు. కాగా తీగల కృష్ణారెడ్డి తెలంగాణ టీడీపీ అధ్యక్ష పదవి ఇవ్వాలనే యోచనలో చంద్రబాబు ఉన్నట్లు సమాచారం.

## కెటిఆర్ కు పెద్ద షాక్

### భూకబ్జా కేసులో ప్రధాన అనుచరుడి అరెస్టు!

సిరిసిల్లా నవంబర్ 30 : బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎంఎల్ఏ కెటిఆర్ అనుచరుడిని పోలీసులు అరెస్టు చేశారు. సిరిసిల్లా మున్సిపల్ పరిధిలోని సర్దపూర్ లో కెటిఆర్ ప్రధాన అనుచరుడు బిఆర్ఎస్ కీలక నేత బొల్లి రామ్మోహన్ ను అరెస్టు చేశారు. అతడు అక్రమంగా ప్రభుత్వ భూమిని కబ్జాచేసి, చాలా కాలంగా కంకర క్వారీ నిర్వహిస్తున్నాడని అభియోగం. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో అతడిని శనివారం తెల్లవారుజామున పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.బొల్లి రామ్మోహన్ సిరిసిల్ల పట్టణ బిఆర్ఎస్ బిసి విభాగం అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. అతడు ఇసుక మాఫియా, భూకబ్జా చేస్తూ కోట్లాది రూపాయలు సంపాదిస్తున్నాడని ఆరోపణలున్నాయి. కాగా రామ్మోహన్ అరెస్టు ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# సంపాదకీయం

## మరణం తరువాతే యోధుని చరిత్ర మొదలౌతుంది

పాలకుడు దోపిడీ,పీడనలను
యథేచ్ఛగా సాగించేందుకు
హింసా మార్గాన్ని నమ్ముకున్నాడు

అహింసా పరమోధర్మః అని బోధించాడు
ప్రజాస్వామ్యమని నమ్మబలికాడు
హింసా రాజ్యంగా మలిచాడు
అభివృద్ధి కోసమని నమ్మించాడు
జవ జీవాల్లేకుండా చేస్తున్నాడు

హిట్లర్,ముసోలినీ పాలకుడెవడైనా
అమెరికా, ఇంగ్లాండ్ దేశమేదైనా
ప్రాంతం ఏదైనా, పాలకుడెడైతేనేం
వనరుల దోపిడీయే అందరి లక్ష్యం

స్పార్టకస్,చేగువేరా, భగత్ సింగ్ కొమరం
భీమ్,అల్లూరి,రాంజీ యోధులెవరైతేనేం
వారి అంతమే పాలకుల పంతం
ప్రతిఘటించడమే ప్రజల కర్తవ్యం


నేర పన్నగాలు చేస్తున్నాడు
ఉద్యమాలు కుట్ర అంటున్నాడు
సూర్యోదయం కుట్ర కాదు
సూర్యుడు కుట్రదారుడు కాదు

భావదారిద్ర్యంలో మునిగాడు
భౌతిక నిర్మూలనకు తెగించాడు
మనిషిని భౌతికంగా నిర్మూలించగలడు
వారి ఆశయాలను సమాధి చేయలేడు.

జనం కోసం బ్రతికిన చరిత్ర
ప్రజల గుండెల్లో అజరామరం
అమరులు చరిత్ర చెక్కిన శిల్పాలు
ప్రజల మనసుల్లో చెదిరని స్వప్నాలు.

– రమణా చారి
( అమరులైన యోధుల స్మృతిలో )

# తెలుగు వెలుగుల నీడ 'గురజాడ'



'దేశమును ప్రేమించుమన్నా,మంచి అన్నది పెంచుమన్నా, వొట్టి మాటలు కట్టిపెట్టోరు, గట్టి మేలు తల పెట్టవోరు, పాడి పంటలు పొంగి పొరలె దారిలో నువ్వుపాటు పడవోరు,తిండి కలిగితే కండ కలదోరు,కండ కలవాడె మనిషోరు" ఈ దేశభక్తి గీతం ఎవరు రాశారని అడిగితే ఇట్టే చెప్పే సమాధానం గురజాడ అప్పారావు. తన రచనల ద్వారా వాడుక భాష వ్యాప్తికి, సమాజ సంస్కరణకి కృషి చేసిన ఆయన అభ్యుదయ కవితా పితామహుడిగా కీర్తి గడించారు. తెలుగు సాహిత్య రంగంలో తన కంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న సాహితీకారుడు. 1862 సెప్టెంబర్ 21న ఉమ్మడి ఏపీలోని విశాఖపట్నం జిల్లా యలమంచిలి మండలం రాయవరం గ్రామంలో జన్మించిన ఆయన 1915 నవంబర్ 30న 53 ఏండ్ల వయసులో మృతిచెందారు. విజయనగరంలోనే స్థిరపడ్డ గురజాడ తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించిన మహాకవి. తెలుగు సాహి త్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహితీకారులలో ఒకరు, హేతువాది. 19వ, 20వ శతాబ్ది మొదటి దశకంలోనూ అతను చేసిన రచనలు ఈనాటికీ ప్రజల మన్ననలను పొందుతున్నాయి. అతను ప్రజలందరికీ అర్ధమయ్యే జీవభాషలో రచనలు చేశారు. వీరి కన్యాశుల్కం నాటకానికి సాహితీ లోకంలో ఒక ప్రత్యేకమైన స్థానం. ఈ నాటకంలో అతను సృష్టించిన గిరీశం, మధురవాణి రామప్ప పంతులు మొదలైన పాత్రలు ప్రఖ్యాతి పొందాయి. అభ్యుదయ కవితా పితామహుడు అని బిరుదు పొందిన అప్పారావు, తెలుగు సాహిత్యంలో వాడుక భాష ఒరవడికి కృషి చేసిన వారిలో ముఖ్యుడు. విజయనగరంలో ఆయన డిగ్రీ చదువుతున్నప్పుడు వాడుక భాషా ఉద్యమ నాయకుడు గిడుగు రామమూర్తి అతనికి సహాధ్యాయి. వారిద్దరూ ప్రాణస్నేహితులు. గిడుగు రామమూర్తితో కలిసి వాడుక భాషా వ్యాప్తికి ఉద్యమించారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కన్యాశుల్కము నాటకాన్ని 1890 ప్రాంతాల్లో పూర్తి వాడుకభాషలో రచించారు. ఆ రోజుల్లో ప్రబలంగా వున్న కన్యాశుల్కం, వేశ్యావృత్తి వంటి దురాచారాలపై విమర్శ ఈ నాటకానికి కథావస్తువు. ఇప్పుడు మనకు దొరుకుతున్న కన్యాశుల్కం రెండవ కూర్పును 1909లో రచించారు. 1892లో గురజాడ వారి కన్యాశుల్కము నాటకాన్ని తొలిసారిగా ప్రదర్శించారు. మొదటి ప్రదర్శనకే ఎంతో పేరు వచ్చింది. దీంతో సాహిత్యంలో వాడుక భాష ప్రయోగానికి ఒక రకంగా నాంది పలికినట్టయింది. గురజాడ, గిడుకు ఇద్దరూ కలిసి పత్రికల్లో, సభల్లో, మద్రాసు విశ్వవిద్యాలయంలో గ్రాంథిక భాషావాదులతో అలసట ఎరగకుండా తలపడ్డారు. గిడుగు వాదనాబలానికి, గురజాడ రచనాశక్తి వ్యవహారిక భాషోద్యమానికి వినియోగ పడ్డాయి. వీరు నాడు తెలుగు భాషకు చేసిన కృషికి మరింత వన్నెతెచ్చే విధంగా నేడు కవులు, రచయితలు రచనలు చేయాలి. తెలుగు భాషకు సాటి ఏదీ లేదని చాటిచెప్పాలి. (గురజాడ వర్ధంతి సందర్భంగా )

– కామిడి సతీష్‌రెడ్డి
9848445134

# ప్రత్యక్ష నిరసనోద్యమమే పరిష్కారం



ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో,దేశంలో ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన పేరు ప్రొఫెసర్ జి ఎన్ సాయిబాబా. అకస్మాత్తుగా, అకాల మరణం పొందిన నాటి నుండి నేటి వరకు సంతాప సభలు సమావేశాలు ఏదో ఒక చోట జరుగుతూనే ఉన్నాయి. దినపత్రికల్లో, టీవీ ఛానళ్ల లో, సోషల్ మీడియాలో చర్చ జరుగుతూనే ఉంది. ఆయన అకాల మరణం పైన, ఆయన ఔన్నత్యం పైన, పాలకుల పైన, న్యాయస్థాన తీర్పుల పైన విశ్లేషణలు కొనసాగుతూనే ఉన్నాయి. ఒక రకంగా చెప్పాలంటే వ్యవస్థను పోస్టుమార్టం చేసినంత పనిచేస్తున్నారు. మేధావులు, రాజకీయ నాయకులు, వివిధ వర్గాల ప్రజలు చర్చోప చర్చలు చేస్తున్నారు. ఒక రకంగా ఇదంతా మంచి పరిణామమే. కానీ, సాయిబాబా పనిచేసింది, కోరుకున్నది ఇందుకోసం మాత్రమే కాదు. ప్రత్యక్ష నిరసన, ఉద్యమ కార్యాచరణ అనివార్యతను గుర్తించి నడుచుకోవడం పౌర సమాజం బాధ్యత.



నిజాలు చెప్పినందుకు, అమాయకులకు అండగా నిలిచినందుకు, యువతను చైతన్యపరచినందుకు, జాతివిముక్తి కోసం పోరాడినందుకు, స్వాతంత్ర అభిలాష వ్యక్తపరిచినందుకు పాలకులు కక్షకట్టడం, బలి తీసుకున్న ఘటనలు చరిత్రలో అడగడుగునా కనిపిస్తాయి. సూర్య కేంద్రక సిద్ధాంతాన్ని ప్రచారం చేసినందుకు బ్రూనోను పలు చిత్రహింసలకు గురి చేసి సజీవ దహనం చేశారు. మూఢనమ్మకాలను ప్రశ్నించి, జ్ఞానమే ధర్మమని యువకులను చైతన్యపరచినందుకు సోక్రటీస్కు విషమిచ్చి చంపారు. బానిసల విముక్తి కోసం తిరుగుబాటు చేసిన నాయకుడు స్పాటకస్ ను శిలువ వేసి చంపారు. ఆదివాసుల, మూలవాసుల స్వాతంత్ర్యకాంక్ష కోసం ఉద్యమించిన కొమురం భీం, రాంజీ గోండు, సీతారామరాజులను చంపి వేశారు. భగత్ సింగ్ ఆజాద్ సుఖదేవ్ లను చెరసాల పాలు చేసి ఉరికంబం ఎక్కించారు. ఇలా చెప్పుకుంటూ పోతే లెక్కలేనన్ని చారిత్రక వాస్తవాలు. ఆదివాసులు దళితులు, మైనారిటీలు, అణచివేతకు గురవుతున్న జాతులకు అండగానిలినందుకు జి ఎన్ సాయిబాబా మన కళ్ళ ముందే బలయ్యాడు. కేవలం 58 ఏళ్ళ వయసులో 90% వికలాంగుడుగా ఉండి ఆర్గాన్ ఫెయిల్యూర్ కారణంగా ఆయనకు మరణం సంభవించింది. అన్యాయంగా సుమారు పదేళ్లపాటు అత్యంత ఘోరమైన అండా సెల్ లో నిర్బంధించడమే అందుకు ప్రధాన కారణం. నిర్బంధ కాలంలో సరైన వైద్య సౌకర్యం అందక, సరైన వసతులు లేక, స్వచ్ఛమైన గాలి లభించక, మనుష్య సంబంధాలు దూరమై ఒంటరితనం కారణంగా తీవ్ర మానసిక వేదనకు గురై తీవ్ర యాతన అనుభవించాడు. ఈ పదేళ్ల జైలు నిర్బంధ కాలమే ఆయన మృత్యువు కు దారి తీసింది.

సాయిబాబా విడుదల కోసం అనేక ప్రజా సంఘాలు, పలుయూనివర్సిటీ ల మేధావులు, విద్యార్థులు, రచయితలు, కవులు,కళాకారులు చేసిన విజ్ఞప్తులు ఫలించలేదు. చివరకు ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకున్నా ఫలితం లేకుండా పోయింది. తన మాతృమూర్తి అంత్య క్రియలకు హాజరయ్యేందుకు కూడా మానవతా దృష్టితో నైనా అనుమతి లభించలేదు. చావును నిరాకరిస్తున్నారని బహిరంగంగా ప్రకటించి, చనిపోయే ఆరు మాసాల ముందు నిర్దోషిగా విడుదలైన పోరాటయోధుడు ప్రొఫెసర్ సాయిబాబా . విడుదలై బయటకు వచ్చిన సమయంలో ఈ వాతావరణం ఆయన ఒక కొత్త అనుభూతిని ఇచ్చింది. తర్వాత ఏం చేస్తారని విలేకరులడిగిన ప్రశ్నకు, ప్రజాసేవకే పునః రంకితమవుతానని బలంగా ప్రకటించాడు. ఆదివాసుల కోసం, వారికి రక్షణ ఇచ్చే అడవి కోసం, శతాబ్దాలుగా వారి కాళ్ళ కింద రక్షణలో ఉన్న ఖనిజాలను కార్పొరేట్ సంస్థల దోపిడీకి గురికాకుండా కాపాడేందుకు కృషి చేశాడు. తనకు అంగవైకల్యం శరీరానికి మాత్రమే, మనసుకు కాదని ప్రకటించే ఆచరణతో చేశాడు. తూర్పుగోదావరి జిల్లా అమలాపురం నుంచి వచ్చి హైదరాబాద్, ఢిల్లీ లో చదువు పూర్తి చేసి, ఉద్యోగం ఉద్యోగం చేసినా జీవితకాలం ప్రజాస్వామ్య తెలంగాణ రాష్ట్ర సాధన కోసం, దేశవ్యాప్తంగా అణగారిన వర్గాల, ఆదివాసుల, వివిధ జాతుల విముక్తి పోరాటాల గురించే ఆలోచించాడు, చర్చించాడు, కార్యోన్ముఖుడై పని చేశాడు. ఈ దేశ ప్రజల హక్కుల కోసం, కనీసం రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కుల రక్షణ కోసం ఆలోచించడమే పెద్ద నేరం అయింది. మెదడు చురుగ్గా పనిచేయడమే బెయిల్ రాకుండా, ఘోరమైన శిక్ష విధించేందుకు కారణంగా కోర్టు వివరించింది . ప్రఖ్యాత శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ చేసిన అన్వేషణల విషయానికొస్తే ఆయనలో చైతన్యవంతంగా పని చేసింది కేవలం మెదడు మాత్రమే. ఇటు సాయిబాబా, అటు స్టీఫెన్ హాకింగ్ వీల్ చైర్ కు మాత్రమే పరిమితమై భవిష్యత్ తరాల కోసం తమ జీవితాలను అంకితం చేశారు. సాయిబాబా ఒక వేసిన శిక్ష, స్టీఫెన్ హాకింగ్ కూడా వేసి ఉంటే సైన్స్ పురోగతి ఎలా ఉండేదో అర్థం చేసుకోవచ్చు.

మానవాళి అభివృద్ధి కోసం,ప్రకృతి వనరుల రక్షణ కోసం, అణగారిన వర్గాల హక్కుల కోసం, నిజాలు మాట్లాడినందుకు, దుర్మార్గాలను ప్రశ్నించినందుకు గొంతు నొక్కి వేయడం, జైళ్ళ పాలు చేయడం, పలు రకాలుగా చంపడం నిత్య కృత్యమైంది. చనిపోయిన వెంటనే ఘనంగా అంతిమయాత్ర నిర్వహించడం, నిరసనగా బిగ్గరగా నినదించడం, ఎలక్ట్రానిక్ ప్రింట్ మీడియాలలో చర్చలు జరపడం, సభలు సమావేశాలతో హోరెత్తించడం ఆనవాయితీగా మారింది. ఈ స్ఫూర్తి వారిని బ్రతికించుకునేందుకు, కాపాడుకునేందుకు అవసరమైన ప్రతిఘటన రూపంలో కానరావడం లేదు. అమాయకులను ఎందుకిలా అక్రమంగా నిర్బంధిస్తున్నారని గాని, వేధిస్తున్నారని గాని ప్రత్యక్ష ఉద్యమ కార్యాచరణతో రాజ్యాన్ని అడ్డుకున్న ఘటనలు అరుదుగా ఉన్నాయి. భూమయ్య, కిష్ట గౌడ్ లకు ఉరిశిక్ష విధించిన సమయంలో శ్రీ శ్రీ నాయకత్వంలో పౌర సమాజం జైలు వద్దే నిరసన కార్యక్రమాలు చేపట్టడంతో పలుమార్లు వాయిదా పడింది. చిలకలూరిపేట బస్సు దాహనం కేసులో ఉరిశిక్ష ను యావజ్జీవ శిక్ష గా మార్చారు. కారంచేడు ఘటనపై స్థానికంగా ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి న్యాయ విచారణ జరిపారు. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. సరైన సమయంలో ప్రత్యక్ష కార్యాచరణతో,సంఘటితంగా ఉద్యమించి పాలకుల దుర్నీతిపై పోరాడితే అనేక మందిని ప్రాణాలతో దక్కించుకో గలిగేవాళ్ళమేమో. ఫ్రాక్షనిస్టులు, రాజకీయ నాయకులు చేస్తున్న చేస్తున్న అకృత్యాలు, హత్యలపై సరైన విచారణ ఉండదు, శిక్షలు ఉండవు. బడుగు బలహీన వర్గాలకు, పీడిత తాడిత ప్రజలకు అండగా నిలిచి పోరాడిన వారికే కొత్త కొత్త చట్టాలతో పాశవిక శిక్షలు. రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కు కోసం, ప్రాథమిక హక్కుల కోసం ఉద్యమించడమే కాక, పాలకులను నిలదీసి ప్రశ్నించనంత కాలం సాయిబాబాలు వేధింపబడుతూనే ఉంటారు. వేటాడబడుతూనేఉంటారు. బాధింపబడుతూనే ఉంటారు. బలవుతూనే ఉంటారు. పాలకుల ఫాసిస్ట్ వైఖరిని ప్రతిఘటించకపోతే, ఇలాంటి పాషవిక చర్యలు పునరావృత మౌతాయి. పాలకులు అమలు పరుస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు, ప్రజాస్వామిక వాదులు ఖండించాలి, ప్రతిఘటించాలి. మానవతావాది సాయిబాబా రగిలించిన స్ఫూర్తితో ప్రజలను చైతన్య పరచాలి.

– రమణా చారి

# అంబేడ్కర్ బాటలో జన బాంధవి

నా చిన్ననాటి రోజుల్లో (1970 దశకం) మా నాన్న తరచూ ఒక మహిళా నాయకురాలి తెగువ గురించి చెబుతూ ఉండేవారు. ఆ రోజుల్లో ప్రచార మాధ్యమాలు అంతగా అభివృద్ధి చెందలేదు. కేవలం రేడియో, పత్రికలు మాత్రమే ఉండేవి. అయినా ఆ మహిళా నాయకురాలి పేరు మాత్రం తెలుగు వారి నోట తరచూ వినిపించేది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడ అన్యాయాలు జరిగినా స్వయంగా ఆ ప్రాంతాల్లో హాజరై బాధితులకు అండగా నిలిచేవారు ఆమె. ఆ మానవీయురాలు ఈశ్వరీబాయి. అన్యాయానికి గురవుతున్న వారి పట్ల తనదైన శైలిలో స్పందించి వారికి బాసటగా నిలిచిన ధీశాలి ఈశ్వరీబాయి. ఉద్యమాల ద్వారా హక్కులను సాధించుకోవాలనేది ఆమె అభిమతం. అందుకే తెలుగు నేలపై నాలుగు దశాబ్దాల పాటు ఉద్యమాలకు ఊపిరిగా నిలిచారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబాటుకు గురవుతున్న దళిత ఆదివాసీల గొంతుకగానే కాక అణిచివేతకు గురి అవుతున్న మహిళల పక్షాన దిక్సూచిగా, వెనుకబాటుకు గురవుతున్న తెలంగాణ ప్రాంత ప్రజల నాయకురాలిగా పోరాటాలకు ఆలవాలంగా, ప్రగతిశీల నాయకురాలిగా చరిత్రలో నిలిచిన ఈశ్వరీబాయి సదా స్మరణీయురాలు. నిరుపేద దళిత కుటుంబంలో జన్మించిన ఈశ్వరీబాయి స్త్రీలకు స్వేచ్ఛ సమానత్వం కరువైన రోజుల్లో ఒక దళిత మహిళగా పోరాట స్ఫూర్తిని కొనసాగించి మహిళా లోకానికి వెన్నుదన్నుగా నిలిచారు. మహిళా సాధికారత కొరకు పరితపించారు. స్వయంప్రతిపత్తి కొరకు మహిళా సంఘాలను స్థాపించి ఆర్థిక స్వావలంబన సాధించాలని ఉద్బోధించారు. మహిళలు తమ కాళ్లపై తాము నిలబడి సమాజంలో తల ఎత్తుకు తిరగాలని ఆమె అభిలషించారు. జీవితంలో వ్యక్తిగతంగా అనేక ఇబ్బందులను, ఒడిదుడుకులను ఎదుర్కొన్నారు. చిన్న వయసులోనే పెళ్లి కావడం, కొద్ది కాలానికే భర్త మరణించడంతో ఆమె ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారు. అయినా మొక్కవోని ఆత్మవిశ్వాసంతో రాజకీయరంగంలో ప్రవేశించి రాణించడమే కాకుండా, ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచారు. తాను ఎదుర్కొన్న సవాళ్లు మరెవరూ ఎదుర్కోరాదనే సంకల్పంతో మహిళల అభ్యున్నతిపై ఆమె ప్రత్యేక దృష్టి పెట్టారు. రాత్రి వేళల్లో సైతం ప్రతి గల్లీ తిరుగుతూ మహిళా చైతన్యానికి పాటుపడ్డారు.

# పాత్రికేయ జగత్తు ధ్రువతార

అది 1969వ సంవత్సరం. నేను గుడివాడ అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో పి.యు.సి. చదువుతున్న రోజులు. ఒకరోజు సాయంత్రం గుడివాడలో యస్.పి.యస్. హైస్కూల్లో ఏదో సమావేశం జరుగుతుందని, ఆంధ్రజ్యోతి సంపాదకులు నార్ల వెంకటేశ్వరరావు వస్తున్నారని తెలిసి మిత్రులతో కలిసి అక్కడకు వెళ్లాను. కింగ్ సైజ్ సిగరెట్ లాగా నిటారుగా ఉన్న నార్ల గారిని చూశాను. ఆయన ప్రసంగం అయిపోయిన తర్వాత ఫిల్టర్ సిగరెట్ నోట్లో పెట్టుకుని పక్కకు వచ్చారు. అప్పట్లో నాలాగా చాలామందికి ఎవరైనా పెద్దవాళ్లు కనబడితే ఆటోగ్రాఫ్‌లు తీసుకోవటం అలవాటుగా, గొప్పగా ఉండేది. నేను ఆ కార్యక్రమంలో పంచి పెట్టిన ఒక కరపత్రం మడతపెట్టి వెనుక వైపు సంతకం చెయ్యమని నార్ల దగ్గరకు వెళ్లాను. ఆయన సంతకం బాగా పొడువుగా లాగుతూ 'నార్ల' కదా! నార సాగుతుంది అంటూ ఆటోగ్రాఫ్ ఇచ్చారు. ఆ రోజులలో నార్ల గురించి పెద్దవాళ్లు గొప్పగా చెబుతుంటే విని ఆయన పట్ల అభిమానం పెంచుకున్నాను. తరువాత నాలుగు సంవత్సరాలకు బి.ఎ. ఫైనల్ ఇయర్ చదువుతూ హిందీ కవుల గురించి వ్యాసాలు రాస్తూ ఉండేవాణ్ణి. అప్పట్లో ఆంధ్రజ్యోతిలో పనిచేస్తున్న ప్రముఖులు తుర్లపాటి కుటుంబరావు, పురాణం సుబ్రహ్మణ్యంశర్మ నన్ను ప్రోత్సహిస్తూ నా వ్యాసాలు ఆంధ్రజ్యోతి దిన, వార పత్రికలలో ప్రచురణకు దోహదం చేశారు. ఒకసారి తుర్లపాటి కుటుంబరావు నన్ను నార్ల గదికి తీసుకువెళ్లి హిందీ బాగా చదువుకున్నాడు, హిందీ కవులు, రచయితల గురించి, వారి రచనల పైన వ్యాసాలు రాస్తూంటాడని చెప్పినప్పుడు, ఆయన నన్ను ఎగాదిగా చూసి, వ్యాసాలు చూస్తున్నాను బాగా రాస్తున్నావు. వారి గురించి మన తెలుగు వారికి తెలియాలి కదా! అంటూ నన్ను ప్రోత్సహించారు. నార్ల వెంకటేశ్వరరావు కేవలం జర్నలిస్టే కాదు, స్వాతంత్ర్య సమరయోధుడు, కవి, రచయిత, విమర్శకుడు, నాటక కర్త, చరిత్రకారుడు, అనువాదకుడు, ఆధునిక తెలుగు జర్నలిజానికి ఆద్యుడు. సంపాదకీయాలను ఒక ఉద్యమంగా, సామాజిక సంస్కరణలకు స్ఫూర్తిగా అధికార దుర్వినియోగంపై ఎక్కుపెట్టిన బాణాలుగా ఉపయోగించిన అక్షర యోధుడు. నిజాయితీకి, నిర్భీతికి పర్యాయపదం నార్ల. 1958 నుంచి 1970 వరకు రెండుసార్లు రాజ్యసభకు ఎన్నికైన ఏకైక తెలుగు జర్నలిస్టు. అన్ని రంగాల్లో తన ప్రభావాన్ని ప్రదర్శించిన బహుముఖ ప్రజ్ఞాశాలి.

# బిజెపి ఓబీసీ మోర్చా వర్క్ షాప్ విజయవంతం - గర్నేపల్లి కృష్ణమూర్తి



గజ్వేల్, తెలంగాణ సేన న్యూస్ : సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో శుక్రవారం ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో బిజెపి ఓబీసీ వర్క్ షాప్, సిద్దిపేట జిల్లా బిజెపి ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి గర్నేపల్లి కృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ ఓ బి సి రాష్ట్ర అధ్యక్షుడు గంధ మల్ల ఆనంద్ గౌడ్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని మోడీ నాయకత్వంలో భారతదేశం అగ్రగామిగా రూపొందుతుందని బిజెపి సభ్యత్వ నమోదు అన్ని పార్టీలకంటే భిన్నంగా ఉంటుందని అత్యధిక సభ్యత్వనమోదు బిజెపికే దక్కుతుందని , రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి గెలుపొందడానికి కార్యకర్తలు సన్నద్ధం కావాలని, సూచించారు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పాలనలో వైఫల్యం చెందిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు వెంకటరమణ, గజ్వేల్ పట్టణ బిజెపి పార్టీ అధ్యక్షుడు మనోహర్ యాదవ్, బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు బైరి శంకర్, రాగుల కిరణ్ కుమార్ గౌడ్, సతీష్ గౌడ్, రమేష్ గౌడ్, రవి కురుమ, నాగు ముదిరాజ్, పంజాల అశోక్ గౌడ్, నాయిని సందీప్, అయిల మహేందర్, భాగ్యమ్మ, మమత, బిజెపి ఓబీసీ మోర్చా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# రాజ్యాంగం ప్రకారం మా హక్కులు మాకు కల్పించండి



కొత్తగూడ, తెలంగాణ సేన న్యూస్: ఏజెన్సీలో నివసిస్తున్న ఎస్టి ఆదివాసీవాళ్ళతో సామాన్యంగా నేతకానికులకు సమాన హక్కులు గోదావరి పరివాహక ప్రాంతంలో నివసిస్తూ కాయ గడ్డం తింటూ పోడు వ్యవసాయంపై జీవనాన్ని కొనసాగిస్తున్న నేతకానిలకు తమ హక్కులు కల్పించాలని అలాగే ఐటీడీ తరహా నేతకానిలకు నోడల్ ఏజెన్సీ ఏర్పాటు చేసి విద్య ఉద్యోగ ఆరోగ్య రక్షణ కల్పించాలని ఏళ్ల తరబడి పోడు వ్యవసాయం చేసుకుంటున్న నేతకానిలకు పట్టాలు మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ అనసూయ సీతక్క కు కొత్తగూడలో జరుగుతున్న ప్రజా పాలన విజయోత్సవ సభలో వినతి పత్రాన్ని అందించారు ఈ కార్యక్రమంలో నేతకాని హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు జనగం నరేష్ జిల్లా నాయకులు రాజం సారంగం జనగాం జంగం భద్రయ్య రాజం సాంబయ్య, మండల బాధ్యులు చెన్నూరు మహేందర్ రామటింగ్ శ్రీధర్ జాడి ప్రవీణ్ చెన్నూరుయాకబాబు గంగారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

## శ్రీ సరస్వతీ శిశు మందిర్ లో ఘనంగా జగదీష్ చంద్రబోస్ జయంతి



ఆదిలాబాద్, తెలంగాణ సేన : ఇచ్చోడ మండల కేంద్రము లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ప్రాథమిక పాఠశాల లో భారత శాస్త్రవేత్త జగదీష్ చంద్రబోస్ జయంతి ఘనంగా జరిపారు. జగదీశ్ చంద్రబోస్ ఫోటో కి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అదిలాబాద్ విభాగ శిక్షణ ప్రముక్ శ్రీ కలిమహంతి వేణుమాధవ్ గారు హాజరై ప్రసంగించారు. భారత శాస్త్రవేత్త లను స్మరించు కోవడం,వారి అడుగు జాడల్లో ముందుకు వెళ్ళడం మన భాధ్యత గా భావించాలి అని అన్నారు. జగదీష్ చంద్రబోస్ గారి ఆవిష్కరణ ల గురించి,రేడియో,వృక్ష శాస్త్రాల్లో ఆయన చేసిన పరిశోధనల గురించి విద్యార్థులకు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సామంపెల్లి సుదర్శన్,ప్రధానాచార్యులు మరాఠీ సంతోష్ కుమార్, ఆచార్యులు గాయత్రి, ఉషారాణి, భారతి పాల్గొన్నారు.

## గురుకులాల వసతులపై చర్చకు సిద్ధమా!?

- అభివృద్ధి చేస్తే బోథ్ శాసనసభ్యులు చర్చాకు రావాలి
- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి




ఆదిలాబాద్, తెలంగాణ సేన న్యూస్ : గత పది సంవత్సరాలు గురుకుల విద్యాలయాలను అంధకారంలో నేట్టి నేడు రాజకీయ పబ్బం గడుపుకోవడానికి బీఆర్ఎస్ పార్టీ గురుకులలా బాట పట్టిందని, చంపిన వాడే సంతాప సభ పెట్టినట్టు ఆ పార్టీ వైఖరి ఉందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి ఎద్దేవ చేశారు. 10 సంవత్సరాలలో బిఆర్ఎస్ పార్టీ, కెసిఆర్ ప్రచారం కోసం మౌలిక వసతులు కల్పించకుండా అద్దె భవనాల్లో గురుకులాలు ప్రారంభించి చాలీచాలని వసతులతో, బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బంది లేకుండా గురుకులాలను నిర్వీర్యం చేసే కుట్ర పన్ని నేడు మొసలి కన్నీరు కార్చడం విడ్డూరం అని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వంలో పది నెలల్లోనే గురుకులాల విద్యార్థులకు 75% మేస్ చార్జీలు పెంచిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిది, సకల సౌకర్యాలతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను, కళాశాలలను ప్రతి నియోజకవర్గానికి ఒకటి ప్రారంభిస్తూ 25 వేల మంది విద్యార్థులకు విద్యా అవకాశాలను సుగమం చేస్తున్నామని ఇవి కానరాకుండా ఎక్కడో జరిగిన సంఘటనను బూచి చూయించి రాజకీయ పబ్బం గడుపుకోవడం మానుకోవాలని టిఆర్ఎస్ శ్రేణులకు హితవు పలికారు గతంలో టిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు స్థానిక శాసనసభ్యులు నేరడిగొండ జడ్పిటిసి గా ఉన్న సమయంలో నేరేడుగొండ కేజీబీవీ లో జరిగిన సంఘటన ఏం సమాధానం చెప్తారో, దమ్ముంటే తెలంగాణలో గురుకుల విద్యాసంస్థల పది సంవత్సరాల అభివృద్ధిని మా ప్రజ ప్రభుత్వం 11 నెలల అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమని స్థలం సమయం చెప్పి బోథ్ అంబేద్కర్ విగ్రహం వద్ద రావలసిందిగా సవాల్ విసురుతున్నాం.

# దివ్య పడిపూజ పుష్పాభిషేకం

నర్సంపేట, తెలంగాణ సేన న్యూస్ : ఇరుకుల్ల స్వరాజ్యం వీరలింగం స్థానిక నర్సంపేట పట్టణంలో శనివారం ఉదయం శ్రీ శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప దేవాలయం ప్రాంగణంలో ఆలయ చైర్మన్ శింగిరికొండ మాధవ శంకర్ గుప్తా ఆదేశాల మేరకు పూజ నిర్వాహకులు బ్రహ్మశ్రీ శ్రీ వెంకటేష్ గురుస్వామి పాల్గొనగా దాతలు రాజేశ్వరి మాధవ శంకర్ శిరస్సుపై స్వామివారి విగ్రహాన్ని ధరించి పదినెట్టాంబడి స్వామివారిని ఆసిన్నాం చేయగా చైర్మన్ అధ్యక్షులు ఆలయ కమిటీ దాతలు జ్యోతులు వెలిగిస్తూ కలశం వినాయక పూజలతో గంగా పూజ కలశాలు పుష్పాలతో అలంకరిస్తూ శరణు ఘోష కీర్తనలతో ఆలయం కిక్కిరిసిపోగా స్వామివారి విగ్రహానికి నెయ్యాభిషేకం తేనాభిషేకం పాలు పెరుగు పంచామృతం తో చందనాభిషేకం విబుదాభిషేకం పుష్పాభిషేకం చేస్తూ అభిషేకాల ఫలితాలు మానవ జన్మకు పూజ ఫలాన్ని వివరిస్తూ భక్తులను పరవశింప చేశారు. దాతలు నైవేద్యం శిరస్సుపై ధరించి నృత్యం చేస్తూ పప్పు నెయ్యి ఆవకాయ అరవన్నపాయసం ఇష్టపూర్తిగా స్వామివారికి అవయవాహనం చేస్తూ అన్న ప్రసాద వితరణ దాతలు ఇరుకుల్ల వీరలింగం స్వరాజ్యం మాధవ శంకర్ రాజేశ్వరి, రీనా రిషిత రోనిత్,దొండేటి సుజాత శ్రీనివాసరావు రవికంటి శ్రీదేవి అశోక్ దంపతుల కూతురు యశస్విని జన్మదినం తక్కలపల్లి జయలక్ష్మి సత్యనారాయణ రావు బండారు విజయలక్ష్మి దామోదర్ భూపతి కృష్ణమూర్తి పద్మ సిరిమల్ల నిర్మల కుమారస్వామి దంపతుల కుమారుడు కోడలు మానస మనోజ్ కుమార్ పెళ్లిరోజు అమెరికా నివసితులు మాలదర స్వాములకు నైవేద్యం అన్న ప్రసాద వితరణ చేయడం జరిగింది. తదుపరి చైర్మన్ మాట్లాడుతూ పంపారట్టు పూజలో పలు అభిషేకాల కొరకై దాతలు ముందుకు రాగా భక్తులు కరచాల దోళతో ఆనందం వ్యక్తపరిచారు తదుపరి దాతలకు



నూతన వస్త్రాల తో సన్మానం చేయగా పడిపూజ దాత ఇరుకుల్ల వీరలింగం ఆలయ సిబ్బందికి నూతన వస్త్రాల బహూకరణ చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్నవారు ఆలయ చైర్మన్ శింగిరికొండ సైఫా సురేష్, చింతల కమలాకర్ రెడ్డి దొడ్డ రవీందర్ గుప్తా, దేవుని అంజయ్య,మాధవ శంకర్ గుప్తా, మాదారం చంద్రశేఖరం, శ్రీరాం ఈశ్వరయ్య, వంగేటి గోవర్ధన్, దోమ కుంట్ల సదానందం, శ్రీరాముల శంకరయ్య మిడిదొడ్డి బాబురావు మదనపల్లి వెంకటేశ్వర్లు చెక్కులను కృష్ణమూర్తి పాలకుర్తి శ్రీనివాస్,వజినే పెళ్లి శ్రీనివాస్, పిన్న రామనాథం, శింగిరికొండ వేణుగోపాల్, భూపతి లక్ష్మీనారాయణ దొడ్డ వేణు మల్లెల రాజు ఆకుల ప్రభాకర్ బీరం రవీందర్ రెడ్డి కే భరత్ రావుల సతీష్ శ్రీరాముల కార్తీక్ కాట రఘు మరియు గురుస్వాములు అర్చకులు ఆలయ సిబ్బంది ఆలయ కమిటీ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు

## ఆశలకు పెండింగ్ బిల్లులు వెంటనే ఇవ్వాలి

- జాబ్ చార్ట్ ప్రకారమే పనులు చేయించాలి
- బి ఆర్ టి యూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు




వరంగల్, తెలంగాణ సేన న్యూస్ : ఆశ వర్కర్లకి గత సంవత్సరం నుండి పెండింగ్ లో ఉన్న లెప్రసి సర్వే , పల్స్ పోలియో టిబి సర్వే డబ్బులు వెంటనే చెల్లించాలని తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ (%దీ=ఖ% అనుబంధ) సంఘం ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా %ణవీడనూ% సాంబశివరావు కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు ఆశా వర్కర్ల అధ్యక్షురాలు కలువాల లలిత మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు ఇవ్వకుండానే మళ్లీ సర్వే చేయాలని చెప్పడం సరికాదని సర్వే కు ఉపయోగించే రిజిస్టర్లు ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. జాబ్ చార్ట్ లో లేని పనులను ఆశ వర్కర్లచే వైద్యాధికారులు చేపిస్తున్నారని తక్షణమే వాటిని నిలిపివేయాలని సబ్ సెంటర్ డ్యూటీలు ఆశాల పరిధిలో లేకపోయినా ఒకవైపు డ్యూటీలు వేసి మరోవైపు సర్వేలు చేయాలని ఫీల్డ్ లో ఉండాలని చెప్పటం వల్ల మానసిక పని ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. సబ్ సెంటర్ డ్యూటీ లు తమ పరిధిలోకి రాదని తేల్చి చెప్పిన ఆశా వర్కర్లకు జీతాలు చేయడం లేదని ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. ఇది ఇలానే మళ్లీ పునరావతమైతే %ణవీడనూ% ఆఫీసు ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అనిత, సంధ్య, మల్లీశ్వరి, శమ, సాలమ్మ, సునీత, మంజుల, రేఖా తదితరులు పాల్గొన్నారు

## మావోయిస్టు వారోత్సవాలు అటవీ గ్రామాలలో పోలీసుల తనిఖీలు



ఏటూరు నాగారం ఎస్సై తాజుద్దీన్ ములుగు, తెలంగాణ సేన న్యూస్ : డిసెంబర్ 2 నుంచి 8 వరకు మావోయిస్టు వారోత్సవాలు జరుపనున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తం అయ్యారు. ఏటూరు నాగారం మారుమూల ఏజెన్సీ గ్రామీణ అటవీ ప్రాంతాలలో శనివారం ఎస్సై తాజుద్దీన్ ఆధ్వర్యంలో సివిల్ సిఆర్పిఎఫ్ పోలీసులు ప్రత్యేక బలగాలు మోహరించి విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. డిసెంబర్ 2 నుంచి 8 వరకు మావోయిస్టుల వారోత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంచనియా ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. పోలీసులు ఎప్పటికప్పుడు అడవి గ్రామాలు గుత్తి కోయ గూడాలపై నిఘ నూ మరింత పటిష్టం చేశారు. వాహన తనిఖీల్లో కొత్త వ్యక్తులు కనిపిస్తే వారి వివరాలు సేకరించి గుర్తింపు కార్డులు పరిశీలించి అనుమానాస్పద వ్యక్తులను విచారించి వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ తనిఖీ చేస్తున్నారు. త్రిబుల్ రైడింగ్ ప్రమాదకరంగా అతివేగంగా వాహనాలు నడపరాదని, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులకు ఆశ్రయం కల్పించవద్దని చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే ఊరుకునేది లేదని చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సి ఆర్ పి ఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

## ములుగు జిల్లాలో మావోయిస్టులకు వ్యతిరేకంగా కరపత్రాలు



ములుగు జిల్లా ప్రతినిధి, తెలంగాణ సేన న్యూస్ : ఏటూరునాగారం, ములుగు జిల్లా ఏజెన్సీలో మావోయిస్టులకు వ్యతి రేకంగా వెలిసిన కరపత్రాలు జిల్లాలో కలకలం రేపుతుంది ఇటీవల ములుగు జిల్లా వాజేడు మండలం పెనుగోలు గ్రామానికి చెందిన అన్నదమ్ములను గొడ్డలితో నరికి చంపిన మావోయిస్టులకు వ్యతిరేకంగా ఆదివాసి ఐక్యవేదిక ములుగు జిల్లా పేరిట వాజేడు మండలం చెరుకూరు గ్రామ సమీపం లో రోడ్డుపై వెలిశాయి. ఈ కరపత్రాలను గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి విడిచి వెళ్లినట్లు తెలుస్తుంది మావోయిస్టుల స్వార్థప్రయోజనాల కోసం అమాయక పేద ప్రజలు బలైపోతున్నారని, మావోయిస్టులకు ఆదివాసుల ప్రాణాలు అంటే లెక్క లేదా?అని ప్రశ్నించారు. అమాయక ఆదివాసీ, గిరిజన, పేద ప్రజల ప్రాణాలు తీయడమే నీ ఉద్యమమా అని ఆది వాసులను అడవికి దూరం చేయాలని చూస్తున్నారని కరపత్రాలలో పేర్కొన్నారు.

## చేయూత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే



ములుగు, తెలంగాణ సేన న్యూస్ : ఏటూరునాగారం ,వెంకటాపురం మండలంలోని బర్లగూడెం గ్రామపంచాయతీలో చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్ నుండి మర్రి లక్ష్మా రెడ్డి కాలేజ్ నుండి బీటెక్ విద్యార్థులు ఒక సర్వీస్ టూ మాన్ కైండ్ %చీ+టా% స్థాపించి మారుమూల గ్రామాలలో అనేక సేవా కార్యక్రమాలు చేసి అందులో భాగంగా వెంకటాపురం మండలంలోని బర్లగూడెం గ్రామపంచాయతీ లో ఇంటింటి సర్వే చేయడం జరిగింది. అందులో భాగంగా ప్రభుత్వ పథకాలు మరియు విద్య విద్యుత్ సరఫరా మంచినీటి విష జరాలు అంటువ్యాధులు రవాణా సౌకర్యాలు పట్ల ఒక సర్వే నిర్వహించి దానికి సంబంధించి డేటా ఆధారంతో ఎన్జీవోల సహకారంతో తన వంతు కృషి చేస్తామని అలాగే ఈ డేటా సంబంధిత ప్రభుత్వానికి అందజేసే గ్రామ అభివృద్ధికి తోడ్పడటం ఈ సర్వే యొక్క ముఖ్య ఉద్దేశం. ఈ కార్యక్రమంలో చేయూత ఫౌండేషన్ అధ్యక్షుడు చిడెం సాయి ప్రకాష్ అమ్మ ఫౌండేషన్ నుండి కుర్సం కుమార్ పంచాయతీ సెక్రెటరీ తాటి మౌనిక మాజీ సర్పంచ్ నరసింహ మూర్తి మరియు సర్వీస్ టు మాన్ కైండ్ స్వచ్ఛంద సంస్థ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు..

## కౌలు రైతు ల గుర్తింపు కోసం ఈ నెల 4 న ధర్నా

-సంయుక్త కిసాన్ మోర్చా



హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్ : రైతు పండుగలో కౌలు రైతుల మాటేమిటి? అని రైతు సంఘాల ప్రశ్న? ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత సంవత్సర క్రితం పిసిసి అధ్యక్షుడుగా ఉన్న సమయంలో మేము అధికారంలోకి వస్తే కౌలు రైతులను గుర్తించి అన్ని ప్రభుత్వ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకుంటామని రాతపూర్వకమైన హామీలు ఇచ్చారు. 6 గ్యారంటీలలో కూడా కౌలు రైతులను జోడించిన కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతులకు తక్షణ న్యాయం చేయాలని రైతు సంఘాలు బషీర్బాగ్ ప్రెస్ క్లబ్బులో ధర్నా కౌలు రైతుల పోస్టర్ ఆవిష్కరణ, విలేకర్ల సమావేశం జరిగింది. సమావేశంలో రైతు సంఘం నాయకులు మాట్లాడారు. కౌలు రైతులకు 2011 చట్టాన్ని అమలు చేయాలని రైతు స్వరాజ్య వేదిక నాయకులు మిస్సా కిరణ్ కుమార్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ సాగర్, తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర అధ్యక్షులు జక్కుల వెంకటయ్య, ఏఐపీకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు పి ప్రభాకర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ రాములు, వ్యవసాయ రాష్ట్ర కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రభువు లింగం, రైతు స్వరాజ్య వేదిక కొండల్, శోభన్ తదితరులు పాల్గొని మాట్లాడారు. రైతులను గుర్తించకపోతే రైతులను కూడగట్టి ఆందోళన చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

## 'పుష్ప 2'.. 'దేవర'లా కాదు కదా..

'పుష్ప 2: ది రూల్' మూవీ ప్రమోషన్స్ ప్రస్తుతం పీక్‌లో ఉన్న విషయం తెలిసిందే. పాట్నా, చెన్నయ్, కొచ్చి, ముంబై ఇలా వరసగా గ్యాప్ లేకుండా టీమ్ ప్రమోషన్స్‌ని నిర్వహిస్తోంది. అయితే ఎన్ని చోట్ల ఈవెంట్స్ జరిగినా హైదరాబాద్ మాత్రం 'పుష్ప'గాడికి అడ్డా అనేది ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ వేడుకకు సంబంధించి డిటైల్స్ వచ్చేశాయి. అయితే ముందుగా సోషల్ మీడియాలో హైదరాబాద్‌లో జరిగే 'పుష్ప 2' ప్రీ రిలీజ్ వేడుకకు సంబంధించి అనేక రకాలుగా వార్తలు వైరల్ అవుతుండగా.. మేకర్స్ వాటన్నింటికీ చెక్ పెట్టి.. సెంటిమెంట్‌కే చోటిచ్చారు. ఏంటా వార్తలు? ఏంటా సెంటిమెంట్? అని అనుకుంటున్నారా? విషయంలోకి వస్తే.. మొదటగా హైదరాబాద్‌లో 'పుష్ప 2 ది రూల్' ప్రీ రిలీజ్ వేడుకను మల్లారెడ్డి కాలేజీలో నిర్వహించబోతున్నట్లుగా వార్తలు వైరల్ అయిన విషయం తెలిసిందే. అక్కడ ప్రీ రిలీజ్ ఈవెంట్ అనగానే యాంటీ ఫ్యాన్స్ రకరకాల వార్తలను వైరల్ చేశారు. కానీ మేకర్స్ సెంటిమెంట్‌కు తావిస్తూ.. 'పుష్ప ది రైజ్' ప్రీ రిలీజ్ వేడుక ఎక్కడైతే జరిగిందో.. అదే చోట ఈ పార్ట్ 2 ప్రీ రిలీజ్ వేడుకను కూడా నిర్వహించబోతున్నట్లుగా అధికారికంగా ప్రకటించారు. డిసెంబర్ 2వ తేదీన హైదరాబాద్‌లోని యూసఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్స్‌లో 'పుష్ప 2' ప్రీ రిలీజ్ వేడుక జరగబోతోంది. 'పుష్ప 1' కూడా ఇదే గ్రౌండ్స్‌లో నిర్వహించగా.. అభిమానులు తండోపతండాలుగా తరలివచ్చారు. ఇప్పుడు డబుల్ ఇంపాక్ట్ ఉండే అవకాశం ఉంది. మేకర్స్ దీనిపై దృష్టి పెట్టాల్సి ఉంటుంది

తెలంగాణ సేన

ఆదివారం, 01 డిసెంబర్, 2024

# లగచర్ల లంబాడీలపై పెట్టిన కేసులను భేషరతుగా ఎత్తివేయాలి

– రాష్ట్ర అధ్యక్షులు ధీరావత్ రవి నాయక్ ,గుగులోతు భీమా నాయక్

నల్గొండ /హలియ, తెలంగాణ సేన న్యూస్ : నల్గొండ జిల్లా నాగార్జున సాగర్ హలియ పట్టణం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లోలి టి ఆర్ జి ఎస్ (తెలంగాణ రాష్ట్ర గిరిజన సంఘం), ఎల్ హెచ్ పి ఎస్ (లంబాడి హక్కుల పోరాట సంఘం) రెండు సంఘాల సంయుక్త సమావేశం లంబాడీలు అస్తిత్వ పోరాటాలకు సిద్ధం అవ్వాలని,గిరిజన వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వ కుట్రలను తిప్పి కొట్టాలని శనివారం హాలియా కేంద్రంలో జరిగిన ఎల్ హెచ్ పిఎస్, టిఆర్ జియస్ రెండు సంఘాల సంయుక్త సమావేశం లో సంఘాల రాష్ట్ర అధ్యక్షులు గుగులోతు భీమా నాయక్, ధీరావత్ రవి నాయక్ లు గిరిజనులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్ర శంకర్ నాయక్ అధ్యక్షతన జరగగా ముఖ్య అతిథులుగా సంఘాల రాష్ట్ర అధ్యక్షులు ధీరావత్ రవి నాయక్, గుగులోతు భీమా నాయక్ లు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా మారిన కొడంగల్ లగచర్ల ఘటనలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం దౌర్జన్యంగా లంబాడీల భూములు గుంజుకోవడం, దానికి ప్రతి చర్యగా లంబాడీలు ప్రతిఘటనకు పాల్పడడం ద్వారా, లంబాడీలకు భయపడి భూములు గుంజుకోవడం లేదని ఫార్మసిటీ కంపెనీ వెనక్కి తీసుకుంటున్నామని బహిరంగ ప్రకటన చేశారు.ఇది లంబాడి ప్రజల విజయమని వారు అన్నారు.కానీ అదే సమయంలో లగచర్ల ఘటనలో లంబాడీల మీద బనయించిన అక్రమ కేసులను సైతం తక్షణమే వెనక్కి తీసుకోవాలని, కేసులతో భయభ్రాంతులకు గురిచేసి మానసికంగా, ఆర్థికంగా నష్టపోయిన లంబాడీలకు ఐదు లక్షల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అసలు లంబాడీల జోలికి వచ్చింది ఎవరు, లంబాడీల ఇంటి పైకి మీరు వచ్చారు, లంబాడీల భూముల పైకి మీరు వచ్చారు, దౌర్జనంగా మీరే గుంజుకున్నారు కానీ లంబాడీలు ఎవరి జోలికి పోలే కాబట్టి వారికి నష్టపరిహారం ఐదు లక్షలు ఇవ్వకపోతే మరో ఉద్యమాన్ని రాష్ట్రంలో ముందుకు తీసుకెళ్తామని హెచ్చరించారు. అదే విధంగా అసిఫాబాద్ జిల్లాలో పులి చేసిన దాడిలో మరణించిన



గిరిజన మహిళ లక్ష్మీ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం చట్టం ప్రకారం 40 లక్షల ఎక్స్గ్రేషియా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దాంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు గిరిజనులకు ఇచ్చిన వాగ్దానాలను, చేవెళ్ల ఎస్టీ డిక్లరేషన్ తక్షణమే అమలు చేయాలని, పోడు రైతులకు అమ్ముకునే కొనుక్కునే హక్కు కల్పించాలని, గిరిజనులపై జరుగుతున్న దాడులు అరికట్టాలని అన్నారు. రాష్ట్రంలో బెస్ట్ అవైలబుల్ స్కీం కింద చదువుతున్న ఎస్టి విద్యార్థులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.త్వరలో గిరిజనుల సమస్యల పరిష్కారానికి రెండు సంఘాల ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించబోతున్నట్లు వారు తెలిపారు.ఈ సమావేశంలో టి ఆర్ జి ఎస్, ఎల్ హెచ్ పి ఎస్ సంఘాల నేతలు రాజు నాయక్,హర్కవత్ భీమ్లా నాయక్,పార్లమెంట్ ఇన్చార్జి బానోతు రాందాస్ నాయక్,రామవత్ ప్రసాద్ నాయక్, శ్రీనివాస్ నాయక్, శ్రీహరి నాయక్, ఇల్మల్ నాయక్, అఖిల్ నాయక్, భాస్కర్ నాయక్, నునావత్ అశోక్ నాయక్, ధన్సింగ్ నాయక్ తదితర నేతలు పాల్గొన్నారు.

# బతికున్న తండ్రికి డెత్ సర్టిఫికెట్

ప్రస్తుత సమాజంలో మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే. అందుకు తగ్గట్లుగానే కొందరు విచక్షణ కోల్పోయి రాక్షసుల్లా మారుతున్నారు. ఆస్తుల కోసం అయినవారిని కాదనుకుంటున్నారు. తాజాగా.. ఓ కుమారుడు బతుకున్న తండ్రినే చంపేశాడు. ఆస్తి కోసం తండ్రి పేరుతో డెత్ సర్టిఫికెట్ తీసుకున్నాడు. తండ్రి చనిపోయినట్లు డెత్ సర్టిఫికెట్ సృష్టించి ఆయన పేరుతో ఉన్న ఇంటిని భార్య పేరు మీదకు మార్చాడు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మదంశెట్టి ప్రసాద్ అనే వ్యక్తి 40 ఏండ్ల కింద నిజామాబాద్ జిల్లాకు వలస వచ్చాడు. ఇక్కడే ఇండ్లు కట్టే మేస్త్రీ పనిచేస్తూ బస్సాపూర్‌లో స్థిర నివాసం ఏర్పరుచుకున్నాడు. అతడి భార్య రజని అనారోగ్య కారణాలతో నాలుగేళ్ల క్రితం కన్నుమూసింది. దీంతో ప్రసాద్ కొడుకు ఆశిబ్ నాయుడు, కోడలు దయామణితో కలిసి బస్సాపూర్‌లోనే ఉంటున్నాడు. ప్రసాద్ పని కోసం అప్పుడప్పుడు వేరే ప్రాంతానికి వెళ్తుంటాడు. ఆరు నెలల వరకు అక్కడే ఉండి డబ్బులు సంపాదించుకొని తిరిగొచ్చేవాడు. ఈ క్రమంలో తన తండ్రి ప్రసాద్ 2021లోనే చనిపోయాడని కుమారుడు ఆశిబ్ నాయుడు ఫేక్ డెత్ సర్టిఫికెట్ తీసుకున్నాడు.




ఆ సర్టిఫికేట్ ఆధారంగా తండ్రి పేరిట ఉన్న ఇంటిని తన భార్య దయామణి పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించాడు. ఇంటి డాక్యుమెంట్లను బ్యాంక్‌లో తాకట్టు పెట్టి రూ. 6 లక్షల లోన్ సైతం తీసుకున్నాడు. అయితే ఇటీవల ప్రసాద్ గ్రామంలోకి రావడంతో ఇంటి రిజిస్ట్రేషన్ సమయంలో సాక్షి సంతకాలు పెట్టినవారు అతడిని గుర్తించారు. చనిపోయిన వ్యక్తి ఎలా బతికొచ్చాడని గ్రామస్తులు చర్చించుకున్నారు. ఆస్తి కోసం కుమారుడే తండ్రి చనిపోయినట్లు నమ్మించాడని గుర్తించారు. విషయం తెలుసుకున్న ప్రసాద్ వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు ఆశిబ్ నాయుడుని అదుపులోకి తీసుకున్నారు. మరో వైపు తన సంతకాన్ని సైతం ఫోర్జరీ చేసి ఫేక్ సర్టిఫికెట్ సృష్టించారంటూ నాయుడుపై పంచాయతీ సెక్రటరీ సుకన్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు మరో కేసు నమోదు చేశారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఆస్తి కోసం బతికున్న తండ్రినే చంపేశాడని.. వీడసలు మనిషేనా అని స్థానికులు మండిపడుతున్నారు.

# వినియోగించిన ప్రతిసారీ వైట్ బెడ్‌షీట్‌లు శుభ్రత

ఏసీ బోగీల్లో టిక్కెట్లు రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులకు అందజేసే ఉన్ని దుప్పట్ల పరిశుభ్రత, నాణ్యతపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ అంశంపై పార్లమెంట్‌లో అడిగిన ప్రశ్నకు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చిన విషయం తెలిసిందే. నెలకు ఒకసారి దుప్పట్లను ఉతుకుతున్నట్టు వెల్లడించారు. అయితే, వీటిని నెలకు కనీసం రెండుసార్లు అయినా శుభ్రం చేయాలని ప్రయాణికుల నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయి. తాజాగా, రైల్వే శాఖ దీనిపై స్పందించింది. ఉన్ని దుప్పట్లను నెలకు కనీసం రెండుసార్లు ఉతుకుతున్నట్టు ఉత్తర రైల్వే వెల్లడించింది. ప్రతి 15 రోజులకు ఒకసారి నెఫ్తలీన్ వ్యాపర్‌తో వేడినీళ్లలో ఉడకబెట్టి శుభ్రం చేస్తున్నట్టు తెలిపింది. జమ్మూ, దిబ్రూగఢ్ రాజధాని రైళ్లలోని అన్ని బ్లాంకెట్లను ప్రతి ట్రిప్‌కినూ శుభ్రం చేసే యూవీ రోబోటిక్ శానిటైజేషన్ పైలట్ కార్యక్రమం త్వరలోనే ప్రారంభించనున్నట్టు పేర్కొంది. యూవీ రోబోటిక్ శానిటేషన్‌లో సూక్ష్మక్రిములను చంపడానికి అతినీలలోహిత కిరణాలను ఉపయోగిస్తారు. ఉత్తర రైల్వే అధికార ప్రతినిధి హిమాన్షు శేఖర్ శనివారం మీడియాతో మాట్లాడుతూ.. స్టెరిలైజేషన్‌లో హాట్ నాప్తలీన్ స్టీమ్ వినియోగం సమర్థవంతమైన పద్ధతి అని అన్నారు. అలాగే, తెలుపు రంగు బెడ్‌షీట్‌లను వినియోగించిన ప్రతిసారీ మెకనైజ్డ్ లాండ్రీల వద్ద శుభ్రం చేస్తారని, అవి తప్పనిసరిగా 'వైటోమీటర్ పరీక్ష'లో అర్హత సాధించాలని ఆయన తెలిపారు. 2010కి ముందు ఉన్ని కంబళ్లను రెండు లేదా మూడు నెలలకు ఒకసారి శుభ్రం చేసేవారని ఆయన చెప్పారు. '2010కి ముందు ప్రతి 2 లేదా 3 నెలలకు ఒకసారి ఉతికేవారు.. తర్వాత నెలకు ఒకసారి.. ప్రస్తుతం 15 రోజులకు ఒకసారి శుభ్రం చేస్తున్నాం.. వీటి తరలింపు సవాల్‌గా మారింది.. అన్ని దుప్పట్లను నెలలో కనీసం ఒకసారైనా శుభ్రం చేయిస్తున్నాం.. ఒక నెలలో ఉతకడం ఒక మినహాయింపు.. సాధారణమైనది కాదు' అని హిమాన్షు శేఖర్ అన్నారు. భారతీయ రైల్వే దేశవ్యాప్తంగా రోజూ కనీసం ఆరు లక్షల మంది ప్రయాణికులకు దుప్పట్లు సరఫరా చేస్తోంది. ఒక్క ఉత్తర రైల్వే పరిధిలోనే లక్ష బ్లాంకెట్స్, బెడ్ రోల్స్ అందజేయడం విశేషం.

# హెచ్‌చ్‌పీ బ్లాక్ ఫ్రైడే డీల్స్ ప్రారంభం

ప్రముఖ గ్లోబల్ టెక్ దిగ్గజం హెచ్‌పీ తన లాప్‌టాప్‌లు, డెస్క్ టాప్ కంప్యూటర్లు, ప్రింటర్లపై ఆకర్షణీయ ఆఫర్లు ప్రకటించింది. బ్లాక్ డే ఆఫర్ల కింద సెలెక్టెడ్ లాప్‌టాప్‌లు, డెస్క్ టాప్ కంప్యూటర్లు, ప్రింటర్లపై ఆఫర్లు అందుబాటులో ఉంటాయి. ఓపెన్, విక్టస్, స్పెక్ట్రే, పెవిలియన్, ఎన్వే సిరీస్ లాప్‌టాప్‌లు, డెస్క్ టాప్ కంప్యూటర్లపై ఆకర్షణీయ ఆఫర్లు ప్రకటించింది. ఇది లిమిటెడ్ ఆఫర్ మాత్రమే. అలాగే.. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కార్డు యూజర్లకు ఆఫర్ వర్తించనుందని పేర్కొంది. బ్లాక్ ఫ్రైడే డీల్స్ మనదేశంలో ఇప్పటికే ప్రారంభం అయ్యాయి. డిసెంబర్ 2వ తేదీ వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉండనుంది. రూ.79,999 లేదా అంతకంటే ఎక్కువ లావాదేవీలు జరిపితే రూ.5,000 ఇన్ స్టంట్ క్యాష్ బ్యాక్ ఉంటుంది. లావాదేవీల విలువ రూ.99,999 లేదా అంతకంటే ఎక్కువగా ఉంటే రూ.8000 క్యాష్ బ్యాక్ లభిస్తుంది. హెచ్‌డీఎఫ్‌సీ కార్డులతో ఈఎంఐ ద్వారా కొనుగోలు చేసిన వినియోగదారులకు మాత్రమే ఈ ఆఫర్ అందుబాటులో ఉండనుంది. హెచ్‌పీ విక్టస్, హెచ్‌పీ ఓమెన్ 16, హెచ్‌పీ ఓమెన్ 17, హెచ్‌పీ ఒమెన్ ట్రాన్స్ కెండ్ 14, హెచ్‌పీ ఓమెన్ 35ఎల్ గేమింగ్ డెస్క్ టాప్ కంప్యూటర్ పై ఆఫర్లు అందుబాటులో ఉంటాయి. హెచ్‌పీ ఓమెన్ ట్రాన్స్ కెండ్ 14 విత్ షాడో బ్లాక్ ఆప్షన్ రూ.1,74,999 నుంచి ప్రారంభం అవుతుంది. హెచ్‌పీ నుంచి వచ్చే ఇతర పర్సనల్ కంప్యూటర్లు %–% హెచ్‌పీ ఓమినీ బుక్ అల్ట్రా ఫ్లిప్, హెచ్‌పీ ఓమినీ బుక్ ఎక్స్, హెచ్‌పీ పెవిలియన్ ప్లస్ 14, హెచ్‌పీ ఎన్వీ ఎక్స్360, హెచ్‌పీ స్పెక్ట్రే ఎక్స్360, హెచ్‌పీ ఎలైట్ బుక్ అల్ట్రా జీ1క్యూ, హెచ్‌పీ డ్రాగన్ ఫ్లై జీ4 లపై డీల్స్ ఉన్నాయి. ఇక హెచ్‌పీ ఓమినీ బుక్ అల్ట్రా ఫ్లిప్ 14 అల్ట్రా 7 పీసీ ధర రూ.1.81,999, హెచ్‌పీ ఓమినీ బుక్ ఎక్స్ ధర రూ.1,39,999 నుంచి ప్రారంభం అవుతుంది. వాస్తవానికి మొదట్లో అమెరికాలో బ్లాక్ ఫ్రైడే ఆఫర్లు అందుబాటులో ఉండేవి. అమెరికాలో థ్యాంక్స్ గివింగ్ పేరిట ఒక పండుగ జరుగుతుంది. ఆ పండుగ సందర్భంగా అమెరికాలో బ్లాక్ ఫ్రైడే సేల్స్ జరిగేవి. ఈ సేల్స్‌లో మంచి ఆఫర్లు అందించేవారు. ఒకప్పుడు ఈ సేల్‌లో తక్కువ ధరకు వస్తువులు కొనుగోలు చేసి అమెరికా నుంచి ఇండియాలో ఉన్న తమ స్నేహితులు, బంధువులకు పంపేవారు. కానీ ఇప్పుడు మనదేశంలో కూడా బ్లాక్ ఫ్రైడే సేల్స్ ప్రారంభమయ్యాయి.


# ఒక చిన్న తప్పు పెద్ద సమస్యకు దారి

ఓ లారీ డ్రైవర్ నిర్లక్ష్యం ఎంతో మంది ప్రాణాల మీదికి తెచ్చినంత పని చేసింది. ముందస్తు జాగ్రత్తలు పాటించని ఒక చిన్న తప్పు పెద్ద సమస్యకు దారి తీసింది. లారీ నుంచి ఆయిల్ లీకేజీ జరగడంతో దాదాపుగా 20 మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన హైదరాబాద్ మహానగరం మేడ్చల్ పరిధిలో చోటు చేసుకుంది. ఏ వాహనంకైనా ముందు దాని కండిషన్ చెక్ చేయడం తప్పనిసరి..! అంతా బాగుంది అని ముందు నిర్ధారించుకుంటేనే ఆ తర్వాతే రోడ్డు మీదికి వెళ్లడం సరైన పద్ధతి. ఇక్కడ ఆ తప్పే చేశాడు ఓ లారీ డ్రైవర్. నిర్లక్ష్యమా లేక ఏం జరుగుతుందిలే అనే అతి నమ్మకమా తెలియదు కానీ, అతను చేసిన ఆ తప్పు వల్ల చాలా మంది ఇబ్బందులు పడాల్సి వచ్చింది. హైదరాబాద్ శివారు నాగారం మున్సిపల్ పరిధి ఎస్వీ నగర్లో మెయిన్ రోడ్డుపై వెళ్తున్న ఓ లారీ నుంచి ఆయిల్ లీక్ అయ్యింది. అది గమనించని ద్విచక్ర వాహనదారులు దాని పైనుంచే వెళ్లడంతో జర్రున జారి ఒకరి తర్వాత ఒకరు రోడ్డుపై పడిపోయారు. ఒకరిద్దరికి తలలకు తీవ్ర గాయాలయ్యాయి. అలా దాదాపుగా 20 మందికి స్వల్ప గాయాలయ్యాయి. తద్వారా ఒకరు చేసిన తప్పిదానికి అంత మంది ఇబ్బంది పడాల్సి వచ్చింది. జారిన బండ్లతో రోడ్డుపై ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. ఆ తర్వాత అదే మార్గంలో వస్తున్న కొందరు అది చూసి రూట్ మార్చుకుని వెనక్కి తిరిగి వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు రోడ్డుపై నుంచి ఆయిల్ తొలగించే ప్రయత్నం చేశారు. ఇక ఆ మార్గంలో వచ్చే వాహనదారులు ఇబ్బందులు పడకుండా ఎక్కడికక్కడ కట్టడి చేసే ప్రయత్నం చేశారు పోలీసులు.

# వరుసగా బయటపడుతున్న కొండచిలువలు

కొండ చిలువలు రైతులను భయపెట్టిస్తున్నాయి. వరి కోతలు పూర్తి కావడంతో.. కొండచిలువలు బయటకు వస్తున్నాయి. భారీ సైజ్ లో ఉన్న కొండ చిలువలు రోడ్లపై సంచరిస్తున్నాయి. ఇటీవల ఈ ప్రాంతం లో కొండచిలువల బెడద పెరిగిపోయింది. దీంతో రైతులతో పాటు స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ శివారు ప్రాంతంలో భారీ సైజ్ కొండ చిలువలు సంచారిస్తున్నాయి. నీరుకుల్ల రోడ్ లోని %ఎ%86 కెనాల్ ప్రాంతంలో ఇవి ఎక్కువగా కనబడుతున్నాయి. వరి కోతలు పూర్తి కావడంతో ఒక్కసారిగా రోడ్లపైకి వస్తున్నాయి కొండచిలువలు. దీంతో రాత్రి పూట వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఎంతకీ రోడ్డుపై నుండి వెళ్లకపోవడంతో ఎక్కడికక్కడే వాహనాలు నిలిపివేస్తున్నారు. ప్రయాణికులు ధైర్యం చేసి కొండ చిలువలను తరిమేస్తున్నారు. గత నాలుగు రోజుల క్రితం ఓ రైతు వరి పొలాన్ని హార్వెస్టింగ్ చేస్తుండగా, ఒక కొండచిలువ హార్వెస్టర్ లో ఇరుక్కుని చనిపోయింది. ఇక మార్నింగ్ వాకింగ్ వెళ్లే వాకర్స్‌కు కొండచిలువలు కనిపిస్తుండటంతో కొన్ని రోజులుగా భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఈ ప్రాంతంలో వరుసగా కొండచిలువలు బయటపడుతుండటంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఇటీవల ఈ ప్రాంతం లో కొండచిలువల బెడద పెరిగిపోయింది. కెనాల్ నుంచి ఆనకొండలు బయటకు వస్తున్నాయి. పొలాల నుంచి బయటకు రావడంతో రైతులు పరుగులు తీస్తున్నారు. అప్పుడప్పుడు.. స్నేక్ క్యాచర్స్ కి సమాచారం ఇచ్చి పట్టిస్తున్నారు. ఈ కొండచిలువ నుంచి విముక్తి కల్పించాలని కోరుతున్నారు రైతులు.

# మరో భారీ ఎన్‌కౌంటర్.. ఏడుగురు మావోయిస్టులు మృతి



అడవిలో అలజడ దండకారణ్యం ఒక్కసారిగా దద్దరిల్లుతోంది.. తుపాకుల మోతలతో రక్తమోడుతోంది. పచ్చని అటవీప్రాంతం ఎరుపెక్కుతోంది. ఇటీవల ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతం వరుస ఎన్‌కౌంటర్లతో రక్తసిక్తమయిన విషయం తెలిసిందే.. తాజాగా.. తెలంగాణలో మరో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ములుగు జిల్లాలోని చల్పాక సమీప అడవుల్లో మావోయిస్టు గ్రేహౌంబ్స్ బలగాల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి.. ఈ భారీ ఎన్ కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్ట్ పార్టీ కీలక నేత బద్రు ఎన్కౌంటర్‌లో మృతి చెందినట్లు పేర్కొంటున్నారు. ఆయనతోపాటు మృతుల్లో మరికొందరు కీలక నేతలు ఉన్నట్లు తెలుస్తోంది.. సరిగ్గా వారం రోజుల క్రితం ఇద్దరు ఆదివాసీలను ఇన్ఫార్మర్ నెపంతో మావోయిస్టులు హత్య చేశారు. వారం తిరగకముందే.. ఏడుగురు మావోయిస్టులను ఎన్కౌంటర్ లో చనిపోయారు.. ఆదివాసీల హత్య అనంతరం అటవీ ప్రాంతంలో గ్రేహౌండ్స్ బలగాలు భారీ కూంబింగ్ నిర్వహించారు.. ఈ క్రమంలోనే.. చల్పాక సమీప అడవుల్లో పోలీసు జవాన్లకు.. మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. పోలీసులపైకి కాల్పులు జరపడంతో.. గ్రేహౌండ్స్ బలగాలు తిరిగి కాల్పులు జరిపారు. ఘటనాస్థలంలో రెండు %ూఖ%-47 రైఫిల్స్ స్వాధీనం చేసుకున్నారు.. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇల్లందు–నర్సంపేట ఏరియా కమిటీ హతమైనట్లు తెలిపారు. డిసెంబర్ 2 (రేపటి నుండి) నుంచి 8వ తేదీ వరకు మావోయిస్టు పార్టీ పి.ఎల్.జి.ఏ వారోత్సవాలు నేపథ్యంలో మావోయిస్టులు కీలక భేటీ నిర్వహించారు.. అయితే. ఈ భేటీపై పక్కా సమాచారంతో పోలీసులు చుట్టుముట్టినట్లు తెలుస్తోంది. 14 సంవత్సరాల తర్వాత వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధిలో అతి పెద్ద ఎన్కౌంటర్ జరిగినట్లు అధికారులు తెలిపారు.

# నడిరోడ్డుపై మందుబాబు వీరంగం

మత్తులో మునిగితే ప్రపంచాన్నే మరిచిపోతారు కొందరు.. ఎక్కడ ఉన్నాం.. ఏం చేస్తున్నాం.. మన వల్ల పక్కవాళ్ల ఇబ్బంది పడుతున్నారేమో అని కనీస విచక్షణ కూడా ఉండదు అలాంటివాళ్లకు.. దానికి తోడు ఈ మధ్య మద్యం, డ్రగ్స్, గంజాయి వంటి మత్తు కలిగించే వాటిని సేవించి విచ్చలవిడిగా ప్రవర్తిస్తూ వాటికి బానిసలు అవుతున్న వారి సంఖ్య మరింత ఎక్కువైంది. ఇక్కడ కూడా సరిగ్గా అలాగే ఓ గంజాయి మహానుభావుడు చేసిన నిర్వాకం చూస్తే మీరు కూడా ఆశ్చర్యపోక తప్పదు. హైదరాబాద్ పాతబస్తీ చంపాపేట్ ప్రధాన రహదారిలో ఓ యువకుడు చేసిన హంగామా అంతా ఇంత కాదు. ఫుల్లుగా గంజాయి సేవించాడు. ఇంకేముంది.. ఎవడు నాకు అడ్డు అన్నట్లుగా నడిరోడ్డుపైనే దుకాణం పెట్టేశాడు. వచ్చిపోయే వాహనాలను ఆపుతూ ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేశాడు. అంత ట్రాఫిక్ మధ్య అతనికి ఏమైనా జరుగుతుందేమో అని మనం భయపడడం తప్ప.. ఆ మహానుభావుడు మాత్రం భయం లేకుండా రోడ్డుపై హైడ్రామా క్రియేట్ చేశాడు. కాసేపు కింద కూర్చుంటాడు.. కాసేపు లేచి అటు ఇటు తిరుగుతాడు. అంతటితో ఆగకుండా బస్సు, కారు, బైకు అనే తేడా లేకుండా అడ్డం వచ్చిన అన్ని వాహనాలను నిలువరిస్తూ నానా హంగామా సృష్టించాడు. పోనీ ఎవరైనా నచ్చజెప్పినా వినే పరిస్థితిలో అతను లేనట్లు తెలుస్తోంది. అందుకే ఎవరికి ఎంత ఇబ్బంది కలిగించినా.. ఆ వ్యక్తి కంట పడకుండా మెల్లగా అక్కడ నుంచి జారుకోవడం తప్ప చేసేదేమీ లేదనుకున్నారేమో.. ఎవ్వరు కూడా అతన్ని ఆపి వార్నింగ్ ఇచ్చినట్లు కూడా కనిపించిన దాఖలాలు లేవు. ఫలితంగా గంటల తరబడి ట్రాఫిక్ జామ్‌తో పాటు చాలా మంది వాహనదారులు ఇబ్బందుల పాలయ్యారు. పైగా అక్కడ ఉండి కట్టడి చేయాల్సిన ట్రాఫిక్ సిబ్బంది కూడా కనబడకపోవడం గమనార్హం. అందుకే ఆ గంజాయి మహానుభావుడు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లుగా కనిపించిది అక్కడ పరిస్థితి.



- దేశంలోనే మొదటి సంస్థగా పేరు
- 265 అన్నదాన కార్యక్రమాలు పూర్తి
- పన్నెండు సంవత్సరాలు,

# సమాజ సేవలో దూసుకుపోతున్న స్కై



మూడు జిల్లాలు, పన్నెండు వందలకు పైగా సేవ కార్యక్రమాలు సామాజిక సేవే ఆయన లక్ష్యం.. ప్రజా శ్రేయస్సే ఆయన ధ్యేయం.. మానవత్వం ఆయన ఊపిరి.. మంచి తనమే ఆయన మార్గం.. 12 సంవత్సరాలుగా నిరంతరాయంగా సమాజ సేవ చేస్తూ అందరి మన్ననలు పొందిన స్కై ఫౌండేషన్ ఫౌండర్, ప్రెసిడెంట్ వై సంజీవ కుమార్ సేవ చేయటంలో దూసుకుపోతున్నారు. పన్నెండు సంవత్సరాలు, మూడు జిల్లాలు, పన్నెండు వందలకు పైగా సేవ కార్యక్రమాలు చేస్తూ రెట్టింపు ఉత్సాహంతో ముందుకు సాగుతున్నారు సంజీవ్. హైదరాబాద్ లో స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో 265 అన్నదాన కార్యక్రమాలు పూర్తి చేసుకొని, 163 బట్టల పంపిణి కార్యక్రమాలు, 150 ఔషదాలు పంపిణి కార్యక్రమాలు చేపట్టారు. ప్రతి పండుగకు ప్రత్యేక వంటలను తయారు చేసి అనాధలకు, నిరాశ్రయులకు పంపిణి చేశారు. రాఖి పౌర్ణమి రోజు అనాధలకు, నిరాశ్రయులకు రాఖీలు కట్టి ఆహారాన్ని సైతం అందిస్తున్నారు. ప్రతి సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలో సామూహిక పుట్టిన రోజు వేడుకలు నిర్వహించడంతో పాటు పాఠశాలలో విద్యార్థులకు ఆటవస్తువులు ఇవ్వడం, విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేయడం వంటి కార్యక్రమాలను చేస్తున్నారు. అంతేకాకుండా రోడ్ల పక్కన జీవనం సాగించే సంచార జాతులు కుటుంబాల చిన్నారులకు జన్మదిన వేడుకలు నిర్వహించి, అక్షరాభ్యాసం చేయించడం, బహుమతులు అందించి వారిని మానసికంగా బలవంతుల్ని చెందుతున్నారు సంజీవ కుమార్. ప్రతీ జనవరి 26వ తేదీ %ు% ఆగస్టు 15వ తేదీన అనాధలు,నిరాశ్రయుల మధ్యన గణతంత్ర, స్వాతంత్ర వేడుకలను నిర్వహించడం జరుగుతుంది.జనవరి 26వ తేదీ ఆగస్టు 15వ తేదీన ప్రభుత్వ పాఠశాలలో గణతంత్ర, స్వాతంత్ర వేడుకలను నిర్వహించి చిన్నారులకు ఆట వస్తువులు, స్టేషనరీ అందిస్తారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ 31వ తేదీ %ు% జనవరి 1వ తేదీ అర్ధరాత్రి సమయంలో రోడ్ల పక్కన ఉన్న అనాధలకు, నిరాశ్రేయులకు దుప్పట్లు పంపిణి కార్యక్రమం, వివిధ వస్తువులను సేకరించి నిరుపేదలకు పంపిణి చేస్తారు. ప్రభుత్వ పాఠశాలలో పోలీస్ పెట్రోల్ వాహనాలలో వారు ప్రత్యేకంగా తయారు చేసిన మెడికల్ కిట్స్ ను అందిస్తారు. ప్రతి సంవత్సరం మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాలలో రాణించిన మహిళలను గుర్తించి వారిని ఘనంగా సత్కరిస్తారు. ప్రతి సంవత్సరం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం చేయడం జరుగుతుంది. వసంత పంచమి సందర్భంగా ప్రభుత్వ పాఠశాల చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించడం, ప్రతి సంవత్సరం హరితహారం నిర్వహించడం జరుగుతుంది. డ్రగ్స్, పర్యావరణం, పొల్యూషన్, ఎడ్యుకేషన్, ఓటు తదితర అంశాల పై అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తారు.వివేకాంద, అంబెడ్కర్, గాంధీ, శివాజీ మొదలైన నాయకుల జన్మదిన వేడుకలను స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తారు.నిరుపేదలకు స్వయంఉపాది కలిపించడం, కార్మికుల దినోత్సవం సందర్భంగా ప్రతి సంవత్సరం జి హెచ్ ఎం సి కార్మికులకు ఘనంగా సన్మానం చేసి బహుమతులను అందజేస్తారు. ఎండాకాలంలో ట్రాఫిక్ పోలీస్ వారికి, ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు అంబలి, మజ్జిగ పంపిణి చేస్తారు. అదేవిధంగా ప్రజలకు, నిరాశ్రయులకు, అనాధలకు కూడా అంబలి, మజిగ్గ పంపిణి చేస్తారు. జనగాం లో 39 అన్నదాన కార్యక్రమాలు పూర్తి చేసుకుని 5 బట్టల పంపిణి కార్యకమాలు పూర్తి చేశారు.

ప్రభుత్వ పాఠాశాలలో సామూహిక పుట్టిన రోజు వేడుకలు నిర్వహించడం,
ప్రభుత్వ పాఠశాలలో %ు% పోలీస్ పెట్రోల్ వాహనాలలో మేము ప్రత్యేకంగా తయారు చేసిన మెడికల్ కిట్స్ ను స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేస్తారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో 28 అన్నదాన కార్యక్రమాలు పూర్తి కాగా 8 బట్టల పంపిణి కార్యకమాలు చేపట్టారు. అదేవిదంగా ప్రభుత్వ పాఠాశాలలో సామూహిక పుట్టిన రోజు వేడుకలు నిర్వహించడం, ప్రభుత్వ పాఠశాలలో %ు% పోలీస్ పెట్రోల్ వాహనాలలో మేము ప్రత్యేకంగా తయారు చేసిన మెడికల్ కిట్స్ ను అందివ్వడం జరుగుతుంది.హరితహారం కూడా నిర్వహిస్తారు. కరోనా సమయంలో మొదటి లాక్ డౌన్ లో అనాధలకు, నిరాశ్రయులకు మొదటి రోజు నుంచి చివరి రోజు నిత్యం అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. మూగజీవాలకు ఆహారం అందించడం, నిరుపేదలకు నిత్యావసర సరుకులు అందించారు. సినిమా పరిశ్రమలో ఇబ్బంది పడుతున్న వాళ్లకు నిత్యావసర సరుకులు అందించారు వలస కార్మికులకు ఆహారాన్ని గుడ్లను, పండ్లను అందించారు.రెండవ లాక్ డౌన్ లో అనాధలకు, నిరాశ్రయులకు మొదటి రోజు నుంచి చివరి రోజు నిత్యం అన్నదాన కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది.మూగజీవాలకు ఆహారం అందించడం, నిరుపేదలకు నిత్యావసర సరుకులు అందించారు వలస కార్మికులకు ఆహారాన్ని గుడ్లను, పండ్లను అందించారు. దేశంలోనే మొట్ట మొదటి సారి కేంద్ర ప్రభుత్వానికి అనేక రకాలుగా విజ్ఞప్తులు చేసి వత్తిడి తెచ్చి ఆధార్ కార్డు, మొబైల్ లేని అనాధలకు, నిరాశ్రయులకు కరోనా వ్యాక్సిన్ వేయించిన మొట్ట మొదటి సంస్థ స్కై ఫౌండేషన్. రల్డ్ ఫోటో గ్రఫీ డే సందర్భంగా వివిధ పత్రికలలో పని చేస్తున్న ఫోటో జర్నలిస్ట్ లకు మెమొంటో ఇచ్చి ఘనంగా సత్కారం చేస్తారు. కరోనా సమయంలో కరోనా రోగులకు వారి యొక్క శాంపిల్స్ సేకరించిన వారికి కరోనా యోధులుగా గురించి ఘనంగా సన్మానం చేశారు. అనాధలకు, నిరాశ్రయులకు ఆశ్రయం కలిపించి ఆహారం, వైద్యం, దుస్తులు అందించి వాళ్లకు వివిధ స్వయం ఉపాధి వాటిలో శిక్షణ అందించి వారిచే కుటీర పరిశ్రమలు నెలకొల్పి వాళ్ళ జీవితాలు వాళ్ళే బ్రతికేలా తీర్చిద్దాలి అనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారు. స్కై ఫౌండేషన్ సేవ కార్యక్రమాలను అన్ని జిల్లాలకు విస్తరించడంతో పాటు వివిధ రాష్ట్రాలలో కార్యక్రమాలు కొనసాగేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇంకా ఎన్నో విభిన్న సేవ కార్యక్రమాలు చేపట్టారు. ఆకలితో అలమటిస్తూ, దయనీయ స్థితులలో ఎవ్వరూ ఫుట్ పాత్ల మీద జీవనం సాగించకుండా వారికి ఆశ్రయం కలిపించి, ఆహారం, వైద్యం అందించి నూతన జీవితాన్ని అందించడమే స్కై ఫౌండేషన్ ప్రధాన లక్ష్యం అని చెప్తున్నారు ఆ సంస్థ ఫౌండర్, ప్రెసిడెంట్ సంజీవ కుమార్. ఆకలితో అలమటిస్తూ, దయనీయ స్థితులలో ఎవ్వరూ ఫుట్ పాత్ల మీద జీవనం సాగించకుండా వారికి ఆశ్రయం కలిపించి, ఆహరం, వైద్యం అందించి నూతన జీవితాన్ని అందించడమే ప్రధాన లక్ష్యం. కృత్ఞతలు



అభాగ్యులకు అన్నదానం (ఫైల్ ఫోటో)





అనాధకు చికిత్స అందిస్తున్న దృశ్యం (ఫైల్ ఫోటో)

– ఫౌండం & ప్రెసిడెంట్.
డాక్టర్. వై. సంజీవ కుమార్


## అటవీ అధికారుల నిర్లక్ష్యం వల్లనే పులిదాడిలో యువతి మృతి

ఆదిలాబాద్ /ఉట్నూర్, తెలంగాణ సేన : అటవీ అధికారుల నిర్లక్ష్యం వల్లనే పులిదాడిలో యువతి మృతి చెందిందని యువతి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి,50 లక్షల ఎక్స్రేషియా ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ సిడాం జంగుదేవ్ డిమాండ్ చేశారు.అటవీ అధికారులు నిర్లక్ష్య వల్లనే పులిదాడికి యువతి బలైయింది.కాగజ్ నగర్ మండలంలోని బెంగాల్ టైగర్ 06 నంబర్ శుక్రవారం నాడు గ్రామంలో పత్తి కూలీకి వెళ్లిన మోర్ల లక్ష్మి అనే యువతిని పులి దాడిచేసి చంపివేయడం దారుణం.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు జంతువుల రక్షణ పేరుతో కోసం వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తూ అమాయక ఆదివాసి ప్రజలను చంపివేస్తున్నారు.అటవి జంతువులు ఊర్లోకి వచ్చి ప్రజల పైన, సాధు జంతువుల పైన దాడి చేసి ప్రాణాలు తీస్తుంటే అటవి అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోకపోవడంలేదు.ఈ ఘటనలు ప్రతి సంవత్సరం పునరావృతం అవుతున్నాయి.సిర్పూర్ నియోజకవర్గంలోనే పులులు, ఏనుగులు మనుషుల ప్రాణాలు తీయడం దురదృష్టకరం.విధులను నిర్లక్ష్యం చేస్తూ ప్రజలకు సమాచారం ఇవ్వకుండా నిండు ప్రాణాలను బలి తీసుకున్న అటవీ అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.కావ్వల్ టైగర్ జోన్ పేరుతో అమాయకులైన ఆదివాసులపై,రైతులపై పులి తీవ్రంగా దాడి చేస్తున్నప్పటికు పులిని ఎప్పుడు ఫారెస్ట్ అధికారులు బంధించలేదు.పులి పేరుతో భయభ్రాంతులకు గురిచేసి ఆదివాసీలను అడవి నుంచి గెంటి వేసి అంటే అడవి సంపదను



దోచుకోవడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భయాందోళన గురి చేస్తున్నారు.పులి ఉందని ప్రచారంతో అడవికి పోకుండా ఉంటారని,ఆ నెపంతో అటవి భూములు గుంజుకోవడానికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నాటకాలు అడుతున్నాయి.
అవులు ,దూడలు, పశువులు కాపరులు, పంటచేన్లలో కూలీలకు రక్షణ కల్పించాలని ఆదివాసి విద్యార్థి సంఘం డిమాండ్ చేస్తున్నది.యువతి మృతికి ఫారెస్ట్ అధికారులు బాధ్యత వహించాలి.విధులలో నిర్లక్ష్యం వహించిన కాగజ్ నగర్ రేంజ్,గన్నారం బిట్ అధికారులను విధుల నుండి వెంటనే తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.చనిపోయిన యువతి కుటుంబానికి 50 లక్షల ఎక్స్రేషియా ఒక ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఆదివాసి విద్యార్థి సంఘం ప్రభుత్వం ముందు డిమాండ్ ఉంచుతున్నది. పెందుర్, మోతీరాం ,పెందుర్, జనార్ధన్, జంగుపటేల్, భీంరావు,రావి, జుగదిరావు అర్జున్ ఇతరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో కారు డ్రైవింగ్



హైదరాబాద్:లంగర్హౌజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదం లో ఇద్దరు మరణించారు . మద్యం మత్తులో డ్రైవర్ పవన్ స్విఫ్ట్కారు నడుపుతూ టూ వీలర్తో పాటు ఆటోను ఢీకొట్టాడు .ఈ ప్రమాదంలో దంపతులు మృతి చెందారు. మరో నలుగురికి గాయాలయ్యాయి.. మృతులు మోనా,దినేష్ ఇద్దరిదీ ప్రేమ వివాహం. దినేష్ ఇటీవలే తన పుట్టినరోజు వేడుకల కోసం తన భార్యతో కలిసి లంగర్ హౌస్లోని అత్తారింటికి వచ్చాడు.లంగర్హౌస్ నుంచి బంజారాహిల్స్కు స్కూటీపై బయలుదేరారుఈ సమయంలోనే స్విఫ్ట్ కారు ఢీకొట్టింది. మృతులు బంజారాహిల్స్ నంది నగర్ లో కొంతకాలంగా నివాసం ఉంటున్నారు. ఇద్దరు దంపతులు ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్నారు. మృతురాలు మోనా గర్భవతి కావడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. .మృతదేహాలను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో స్విఫ్ట్ కారు ఢీకొట్టిన ఆటోలో ఉన్న మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి.గాయపడ్డవారు ఆస్పత్రితో చికిత్స పొందుతున్నారు. కారు డ్రైవర్ పవన్ను అదుపులోకి తీసుకున్నారు. అతడు మద్యం మత్తులో ఉన్నట్లు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు

# సినిమా




## రాంచరణ్ గేమ్ ఛేంజర్ ప్లాన్ అదిరింది

స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో గ్లోబల్ స్టార్ రాంచరణ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం గేమ్‌ఛేంజర్ బాలీవుడ్ భామ కియారా అద్వానీ, రాజోలు భామ అంజలి ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని 2025 జనవరి 10న ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల చేయనుండగా.. ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది శంకర్ టీం. గేమ్‌ఛేంజర్ నుంచి తాజాగా లాంచ్ చేసిన మూడో సాంగ్ నానా హైరానా ఫుల్ లిరికల్ వీడియో సాంగ్ కలర్‌ఫుల్‌గా సాగుతూ విజువల్ ట్రీట్ పక్కా అని చెబుతోంది. మరోవైపు ఇప్పటికే రిలీజ్ చేసిన రా మచ్చ, జరగండి జరగండి సాంగ్‌కు నెట్టింట మంచి స్పందన వస్తోంది. అప్పుడే నాలుగో పాట విడుదలతోపాటు ట్రైలర్ అప్‌డేట్‌కు సంబంధించిన వార్త అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తోంది. తాజా సమాచారం ప్రకారం నాలుగో సింగిల్ డిసెంబర్ రెండోవారంలో రాబోతుంది. జనవరి మొదటివారంలో ట్రైలర్‌ను లాంచ్ చేయబోతున్నారు. నాలుగో పాట రాంచరణ్, అంజలి కాంబినేషన్‌లో వచ్చే మెలోడీ సాంగ్ అని తెలుస్తుండగా.. ఇది ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్‌లో రాబోతుందట. అయితే మేకర్స్ నుంచి దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ చిత్రంలో నవీన్ చంద్ర, సునీల్, శ్రీకాంత్, బాలీవుడ్ యాక్టర్ హ్యారీ జోష్, ఎస్‌జే సూర్య, సముద్రఖని, కన్నడ నటుడు జయరామ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ మూవీని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు నిర్మిస్తుండగా..ఎస్ థమన్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.



## వరల్డ్ వైడ్‌గా 12000 వేల స్క్రీన్స్

### బిగ్గెస్ట్ రిలీజ్ ఇండియన్ మూవీగా 'పుష్ప-2'

మరో 06 రోజుల్లో పుష్ప 2 సందడి మొదలు కానున్న విషయం తెలిసిందే. ఎప్పుడెప్పుడా అని బన్నీ అభిమానులతో పాటు మూవీ లవర్స్ ఎదురుచూస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 05న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో ఈ సినిమా ప్రీ రిలీజ్ బిజినెస్‌లో అదరగొడుతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే అన్ని భాషల్లో కలిపి ప్రీ రిలీజ్ బిజినెస్ రూ.1000 కోట్లకు పైగా జరిగినట్లు సమాచారం. ఇదిలావుంటే తాజాగా ఈ చిత్రం విడుదల పరంగా మరో రికార్డును నమోదు చేయబోతుంది. ఈ సినిమా విడుదలకు సంబంధించి వరల్డ్ వైడ్‌గా మొత్తం ఆరు భాషల్లో కలిపి 12000 వేలకు పైగా స్క్రీన్స్‌లో విడుదల కాబోతున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. దీంతో ఇప్పటివరకు రాజమౌళి ఆర్‌ఆర్‌ఆర్ పేరిటా ఉన్న ఈ రికార్డు బద్దలవ్వనుంది. ఆర్‌ఆర్‌ఆర్ చిత్రం 10200 లకు పైగా స్క్రీన్స్‌లో విడుదల అయ్యింది. ఇప్పటివరకు ఇండియన్ సినిమాలలో బిగ్గెస్ట్ రిలీజ్ అయిన చిత్రం ఇదే. అయితే ఈ రికార్డును పుష్ప అధిగమించబోతుంది. ఓవర్సీస్‌లో 5500 వేల స్క్రీన్స్, ఇండియాలో 6500 స్క్రీన్స్‌లో కలిపి మొత్తం 12000 స్క్రీన్స్‌లో పుష్ప 2 విడుదల కాబోతున్నట్లు సమాచారం.

## గెట్ రెడీ.. డబుల్ ట్రీట్ ఇవ్వబోతున్న త్రిష

బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్న స్టార్ హీరోయిన్లలో టాప్‌లో ఉంటుంది చెన్నై సోయగం త్రిష ఈ భామ ప్రస్తుతం తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో లీడింగ్ హీరోలతో సినిమాలు చేస్తోంది. త్రిష ఖాతాలో అజిత్ కుమార్ నటిస్తోన్న విదాముయార్చి, చిరంజీవి నటిస్తోన్న విశ్వంభర సినిమాలున్నాయి. దీంతోపాటు మాలీవుడ్ యాక్టర్ టొవినో థామస్ నటిస్తోన్న ప్రాజెక్ట్ కూడా ఉంది. కాగా 2025 జనవరిలో త్రిష అభిమానులు, ఫాలోవర్లకు డబుల్ ట్రీట్ ఇవ్వబోతుందన్న వార్త నెట్టింట రౌండప్ చేస్తోంది. విదాముయార్చి 2025 పొంగళ్ కానుకగా రాబోతున్నట్టు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. మరోవైపు టొవినో థామస్ సినిమా కూడా జనవరిలోనే రాబోతుంది. టొవినో థామస్‌తో చేస్తున్న ఐడెంటిటీ మలయాళంలో త్రిష రెండో ప్రాజెక్ట్. ఈ రెండు సినిమాల విడుదల తేదీలపై క్లారిటీ రావాల్సి ఉండగా.. తాజా వార్తల ప్రకారం ఒకేసారి త్రిష డబుల్ ట్రీట్ ఇవ్వబోతుండటం ఖాయమైనట్టే. ఈ లెక్కన త్రిష అభిమానులకు మాత్రం పండగే అని చెప్పాలి. మరోవైపు మోహన్ లాల్‌తో రామ్, అజిత్ కుమార్-అధిక్ రవిచంద్రన్ గుడ్ బ్యాడ్ అగ్లీ ప్రాజెక్ట్, మణిరత్నం-కమల్ హాసన్ థగ్ లైఫ్ సినిమాలు కూడా త్రిష లైన్‌లో ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన విదాముయార్చి టీజర్‌కు మంచి స్పందన వస్తోంది.



## ఎన్టీఆర్ - ప్రశాంత్ నీల్ ప్రాజెక్ట్

### టైటిల్ అనౌన్స్‌మెంట్‌కి ముహూర్తం ఫిక్స్!

టాలీవుడ్ అగ్ర కథానాయకుడు యంగ్ టైగర్ ఎన్టీఆర్ ప్రస్తుతం ఫుల్ జోష్‌లో ఉన్న విషయం తెలిసిందే. ఈ ఏడాది దేవర సినిమాతో బ్లాక్ బస్టర్‌ను అందుకున్నాడు తారక్. కొరటాల శివ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలవడమే కాకుండా వరల్డ్ వైడ్‌గా రూ.500 కోట్ల వసూళ్లను రాబట్టింది. అయితే ఈ సినిమా అనంతరం కన్నడ స్టార్ దర్శకుడు కేజీఎఫ్, సలార్ చిత్రాల ఫేమ్ ప్రశాంత్ నీల్‌తో తారక్ సినిమా చేయబోతున్న విషయం తెలిసిందే. NTRNeel గా రానున్న ఈ సినిమాకు డ్రాగన్ అనే టైటిల్‌ను అనుకుంటున్నారు. ఇప్పటికే పూజ కార్యక్రమాలు పూర్తిచేసుకున్న ఈ చిత్రం డిసెంబర్‌లో షూటింగ్ స్టార్ట్ చేయబోతున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి తారక్ ఈ షూటింగ్‌లో పాల్గొనబోతున్నట్లు సమాచారం. ఇదిలావుంటే తాజాగా ఈ మూవీకి సంబంధించి సాలిడ్ అప్‌డేట్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. ఈ సినిమాకు సంబంధించిన టైటిల్ అనౌన్స్‌మెంట్‌ను సంక్రాంతి కానుకగా 2025 జనవరిలో రాబోతోందని తెలుస్తోంది. ఈ సినిమాకు 'డ్రాగన్' అనే టైటిల్ ని అనుకుంటున్నారని టాక్ నడుస్తున్న విషయం తెలిసిందే. మరి మేకర్స్ ప్రచారం జరుగుతున్నట్టుగా ఇదే టైటిల్ ను ఫిక్స్ చేశారా? లేదంటే మరేదైనా కొత్త టైటిల్ ని పెట్టబోతున్నారా ? అనే విషయం తెలియాలంటే సంక్రాంతి వరకు ఆగాల్సిందే. మరోవైపు ఈ మూవీలో 'సప్త సాగరాలు దాటి' చిత్రం హీరోయిన్ రుక్మిణి వసంత్ కథానాయికగా నటించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అలాగే ఈ మూవీని ఒకటే పార్ట్‌లో ఫినిష్ చేయనున్నట్లు తెలుస్తుంది.





## రెడీ ఫర్ యాక్షన్

### ట్రెండింగ్‌లో నందమూరి మోక్షజ్ఞ నయా లుక్

టాలీవుడ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ నందమూరి బాలకృష్ణ కుమారుడు మోక్షజ్ఞ ను గ్రాండ్‌గా లాంచ్ చేస్తున్నాడని తెలిసిందే. SimbaisComing అంటూ ఇప్పటికే మోక్షజ్ఞ జీన్స్ అండ్ బ్లాక్ హుడీ వేసుకొని సూపర్ చామింగ్ లుక్‌లో నడుచుకుంటూ వెళ్తున్న ప్రీ లుక్ షేర్ చేయగా.. మోక్షజ్ఞను ప్రశాంత్ వర్మ ఎలా చూపించబోతున్నాడో హింట్ ఇచ్చేస్తూ.. రిలీజ్ చేసిన స్టైలిష్ లుక్ నెట్టింట వైరల్ అవుతోంది. చాలా రోజుల తర్వాత మరో క్రేజీ లుక్‌ను షేర్ చేశారు మేకర్స్. థిక్ హెయిర్ గెటప్‌లో మ్యాచింగ్ మీసం, గడ్డంతో సూపర్ కూల్‌గా కనిపిస్తూ యాక్షన్‌కు రెడీ అంటూ చెప్పకనే చెబుతున్నాడు మోక్షజ్ఞ. ఈ స్టిల్ నెట్టింట హల్ చల్ చేస్తూ అభిమానులు, నందమూరి ఫాలోవర్లలో సూపర్ హైప్ క్రియేట్ చేస్తుంది. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో రాబోతున్న ఈ సినిమాలో..డైరెక్టర్ ఇంతకీ మోక్షజ్ఞ కోసం ఎలాంటి సీన్లు రెడీ చేశాడు.. సిల్వర్ స్క్రీన్‌పై ఈ అప్‌కమింగ్ యాక్టర్‌తో ఎలాంటి మ్యాజిక్ చేయబోతున్నాడోనంటూ ఆసక్తిగా చర్చించుకుంటున్నారు సినీ జనాలు. మైథలాజికల్ కాన్సెప్ట్‌తో సినిమా రాబోతుందని వార్తలు వస్తుండగా.. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు చివరి దశలో ఉన్నట్టు సమాచారం. ఈ సినిమాకు సంబంధించి మరిన్ని వివరాలపై మేకర్స్ త్వరలోనే క్లారిటీ ఇవ్వబోతున్నారట.



# 6న ఉమర్ ఖలీద్ బెయిల్ పిటిషన్ విచారణ

న్యూఢిల్లీ : ఉపా చట్టం కింద అరెస్టయిన ఉమర్ ఖలీద్‌తో పాటు గుల్ఫిషా ఫాతిమా, ఖలీద్ సైఫీల బెయిల్ పిటిషన్‌పై డిసెంబరు 6న విచారణ జరగనున్నది. న్యాయమూర్తులు జస్టిస్ నవీన్ చావ్లా, జస్టిస్ శైలిందర్ కౌర్‌లతో కూడిన ఢిల్లీ హైకోర్టు ధర్మాసనం దీనిని చేపట్టనున్నది. 2020లో ఢిల్లీ అల్లర్లకు సంబంధించి ఉపా కింద ఈ ముగ్గురూ కేసులను ఎదుర్కొంటున్నారు. తాము సుదీర్ఘ కాలం జైలులో ఉన్నామనీ, దానిని పరిగణలోకి తీసుకొని బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వారు ఈ పిటిషన్‌ను వేశారు. వాస్తవానికి ఉమర్ ఖలీద్ బెయిల్ పిటిషన్‌ను ఈ ధర్మాసనం అక్టోబర్ 7న చేపట్టాల్సి ఉన్నది. కానీ, బెంచ్ సమావేశం విఫలం కావటంతో అది సాధ్యపడలేదు. ఆ తర్వాత పిటిషన్ విచారణ నవంబర్ 25కు జాబితా చేయబడింది. ఈ ఏడాది సెప్టెంబర్ 14తో ఉమర్ ఖలీద్ నాలుగేండ్లు జైలులో గడిపినట్టయ్యింది. బెయిల్ కోసం దిగువ కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు పలుమార్లు ఉమర్ ఖలీద్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ ఏడాది మే 28న దిగువ కోర్టు ఆయన బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది. నాలుగేళ్లలో సుప్రీంకోర్టులో ఆయన బెయిల్ పిటిషన్ 14 సార్లు ఆలస్యమైంది. ఆ తర్వాత ఆయన ట్రయల్ కోర్టును ఆశ్రయించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఉమర్ ఖలీద్ తరఫు న్యాయవాది కపిల్ సిబల్.. దిగువ న్యాయస్థానంలో దాఖలుచేసేందుకు సుప్రీంకోర్టు నుంచి పిటిషన్‌ను వెనక్కి తీసుకున్నారు.

# భగ్గుమన్న పార్లమెంట్

న్యూఢిల్లీ: అదానీ ముడుపుల వ్యవహారం, మణిపూర్ హింస, ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో శాంతి భద్రతల ఉల్లంఘన అంశాలపై చర్చించాలని ప్రతిపక్షాల నినాదాల హోరుతో పార్లమెంట్ దద్దరిల్లింది. ఈ అంశాలపై ప్రభుత్వం చర్చకు నిరాకరించడంతో పార్లమెంట్ నిమిషాల్లోనే సోమవారానికి వాయిదా పడింది. శుక్రవారం తొలుత లోక్‌సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాల హోరెత్తించారు. అదానీ ముడుపులు, లంచం వ్యవహారంపై ప్రధాని మోడీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాల ఆందోళన నడుమ స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలు ప్రారంభించారు. కేంద్రం సమాధానం చెప్పాలంటూ ప్రతిపక్ష సభ్యులు తమ ఆందోళన కొనసాగించారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొనడంతో పది నిమిషాలకే సభను మధ్యాహ్నం 12 గంటలకు స్పీకర్ వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాలు తమ ఆందోళనను కొనసాగించాయి. ప్యానల్ స్పీకర్ దిలీప్ సైకియా అదానీ వ్యవహారం, మణిపూర్ హింస, సంభాల్ హింసపై ప్రతిపక్షాలు ఇచ్చిన వాయిదా తీర్మాన నోటీసులను తిరస్కరిస్తున్నట్టు ప్రకటించారు. దీంతో ప్రతిపక్షాలు తమ ఆందోళనను ఉధృతం చేశాయి. మరోవైపు నేషనల్ ఏఆర్‌టీ అండ్ సరోగసీ బోర్డులో ఇద్దరు మహిళా సభ్యులను నియమించాలని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి నడ్డా తీర్మానాన్ని లోక్‌సభలో ప్రవేశపెట్టారు. దీన్ని మూజువాణి ఓటుతో ఆమోదించారు.

పది నిమిషాల్లో సభను సోమవారానికి వాయిదా వేశారు. మరోవైపు రాజ్యసభలోనూ ఇదే కొనసాగింది. సభను చైర్మెన్ జగదీప్ ధన్కర్ ప్రారంభించగా ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. ప్రతిపక్ష సభ్యులు ఇచ్చిన 17 వాయిదా తీర్మాన నోటీసులను తిరస్కరించారు. దీంతో ప్రతిపక్షాల నినాదాలతో సభ హోరెత్తింది. 13 నిమిషాల్లోనే సభను సోమవారానికి వాయిదా వేశారు.

# ఆశా వర్కర్లను రెగ్యులర్ చేయాలి

న్యూఢిల్లీ: ఆశా వర్కర్లు, ఫెసిలిటేటర్లను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఆశా వర్కర్స్ అండ్ ఫెసిలిటేటర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏడబ్ల్యూఎఫ్ఎఫ్ఐ) డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం నాడిక్కడ జంతర్ మంతర్ వద్ద సీఐటీయూ అనుబంధ ఏడబ్ల్యూఎఫ్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వేలాది మంది ఆశా వర్కర్లు, ఫెసిలిటేటర్లు 'ఆశా సంఘర్ష్ ర్యాలీ' నిర్వహించారు. సామాజిక భద్రత కల్పించాలని, పెన్షన్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మార్చ్‌లో సీఐటీయూ అఖిల భారత అధ్యక్షురాలు కె.హేమలత మాట్లాడుతూ కార్పొరేట్, మతతత్వ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను మార్చేందుకు ఉమ్మడి పోరాటాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే మోడీ సర్కార్ కార్మికుల హక్కులను హననం చేస్తోందని, అందులో భాగంగానే లేబర్ కోడ్‌లను తీసుకొస్తుందని విమర్శించారు.

కార్మికుల సామాజిక భద్రతను గాలికి వదిలేసిన మోడీ సర్కార్ మెడలు వంచాలని అన్నారు. రాష్ట్ర స్థాయిలో అద్భుతమైన పోరాటాలు చేస్తున్న ఆశా వర్కర్లను ఆమె అభినందించారు. జాతీయ స్థాయిలో పోరాటాలను మరింత ఉధృతం చేయాలని పిలుపు నిచ్చారు. ఏడబ్ల్యూఎఫ్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి మధుమిత బందోపాధ్యాయ మాట్లాడుతూ చార్టర్ ఆఫ్ డిమాండ్లు, సమస్యలను వివరించారు. సంఘం ఇప్పటివరకు చేసిన పోరాటాలు, విజయాలను తెలిపారు.

# ఐరాస శాంతి పరిరక్షక కమిషన్‌కి తిరిగి ఎంపికైన భారత్

భారత్ 2025-26 సంవత్సరానికి ఐరాస శాంతి పరిరక్షక కమిషన్ (పిబిసి)కి తిరిగి ఎన్నికైంది. కమిషన్‌లో భారత దేశ ప్రస్తుత పదవీకాలం డిసెంబర్ 31తో ముగుస్తుంది. "భారత్ 2025-26 సంవత్సరానికి యుఎన్ శాంతి పరిరక్షక కమిషన్‌కు తిరిగి ఎంపికైంది. పిబిసి వ్యవస్థాపక సభ్యులిగా, ప్రధాన సహకారిగా, ప్రపంచ శాంతి మరియు స్థిరత్వం కోసం పనిచేయడానికి పిబిసితో తమ సహకారాన్ని కొనసాగించడానికి భారత్ కట్టుబడి ఉంది'' అని ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత కమిషన్ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. పిబిసి సాధారణ అసెంబ్లీ, భద్రతా మండలి మరియు ఆర్థిక, సామాజిక మండలి నుండి ఎన్నికైన 31 సభ్యదేశాలను కలిగి ఉంటుంది. ఐరాసలో ఆర్థికసహకారం అందించే దేశాలు, అగ్రదళం, సహకార దేశాలు కూడా సభ్యులుగా ఉంటాయి. యుఎన్ శాంతి పరిరక్షణకు అత్యధిక సిబ్బందిని అందించిన దేశాలలో భారత్ కూడా ఒకటి. ఇది ప్రస్తుతం అబై, సెంట్రల్ అమెరికన్ రిపబ్లిక్, సైప్రస్, డెమోక్రటిక్ రిపబ్లికన ఆఫ్ కాంగో, లెబనాన్ మిడిల్ ఈస్ట్, సోమాలియా, సౌత్ సూడాన్, వెస్ట్రన్ సహారాలో యుఎన్ కార్యకలాపాలకు సుమారు ఆరువేల మంది సైనిక, పోలీస్ సిబ్బందిని మోహరించింది. సుమారు 180మంది శాంతి పరిరక్షకులు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారు. పిబిసి సంఘర్షణ ప్రభావిత దేశాలలో శాంతి ప్రయత్నాలకు మద్దతు ఇచ్చే అంతర ప్రభుత్వం సలహా సంస్థ. విస్తృత శాంతి అజెండాలో అంతర్జాతీయ సంఘం సామర్థ్యానికి కీలకంగా, అదనంగా పనిచేస్తుంది.

# జిడిపి వృద్ధి గణాంకాలు..

## ఊహించిన దానికంటే దారుణంగా ఉన్నాయి



న్యూఢిల్లీ : ఈ ఏడాది సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికంలో జిడిపి వృద్ధి రేటు 5.4 శాతానికి పడిపోయిందని కేంద్ర గణాంకాల శాఖ శుక్రవారం విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. ఈ నేపథ్యంలో జిడిపి వృద్ధిరేటు ఊహించిన దానికంటే దారుణంగా పడిపోయిందని శనివారం కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ వ్యాఖ్యానించారు. ఇదేక్రమంలో వినియోగం 6 శాతానికి పెరగడం ఆందోళన కలిగిస్తోందని ఆయన ఆరోపించారు. జిడిపి పడిపోవడానికి ప్రధాన కారణం.. కార్మికుల వేతనాల్లో పెరుగుదల లేకపోవడమేనని.. ఈ విషయంలో మోడీ ప్రభుత్వం వాస్తవాలను గుర్తించడం లేదని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రధాని మోడీ ఎప్పుడూ కూడా ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుందని ప్రజల్లో హైప్‌ని సృష్టించారని ఈ మేరకు ఆయన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. కాగా, జిడిపి తగ్గడానికి గల కారణాలపై నరేంద్ర మోడీ, ఆయన చీర్‌లీడర్‌లు ఉద్దేశపూర్వకంగానే విస్మరిస్తున్నారు. అయితే ముంబైకి చెందిన ప్రముఖ ఆర్థిక సమాచార సేవల సంస్థ నవంబర్ 26వ తేదీన విడుదలన చేసిన ' లేబర్ డైనమిక్స్ ఆఫ్ ఇండియన్ స్టేట్స్' తాజా నివేదిక జిడిపి పడిపోవడానికి గల అసలు కారణాన్ని వెల్లడిస్తోంది. ఆ నివేదికలో కార్మికుల వేతనాల్లో పెరుగుదల లోపించిందని స్పష్టంగా తెలియజేస్తోందని రమేష్ అన్నారు. మొత్తంగా నిజవేతనం వృద్ధి గత ఐదేళ్లలో జాతీయ స్థాయిలో 0.01 శాతం పడిపోయిందని తాజా నివేదిక తెలిపింది.

ఈ ఐదేళ్లలో హర్యానా, అస్సాం, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లోని కార్మికుల నిజ వేతనాలు తగ్గాయి. ప్రతి భారతీయుడు గత పదేళ్ల క్రితం కంటే.. ఇప్పుడు తక్కువగా కొనుగోలు చేసే పరిస్థితిలో ఉన్నాడు. ఇదే జిడిపి మందగమనానికి కారణం అని ఆయన స్పష్టం చేశారు.

# అది అమెరికా న్యాయ శాఖ, ప్రైవేట్ సంస్థల లీగల్ సమస్య



న్యూఢిల్లీ : అదానీ ముడుపుల వ్యవహారం పార్లమెంటును పట్టి కుదిపేస్తుంటే అది అమెరికా న్యాయశాఖ, ప్రైవేట్ సంస్థలకు సంబంధించిన లీగల్ సమస్యగా భారత్ కొట్టి పారేసింది. దీనిపై మాకు ఎవరినుంచి ఎలాంటి అభ్యర్థనలు రాలేదని చెప్పింది. మోడీ అత్యంత సన్నిహితుడైన వివాదాస్పద వ్యాపార వేత్త గౌతమ్ అదానీపై అమెరికా న్యాయశాఖ అభియోగాలను మోపిన వారం రోజులకు తీరికగా స్పందించిన విదేశాంగ శాఖ ఆకుకు అందని పోకకు పొందని రీతిలో ఈ వ్యాఖ్యలు చేసింది. విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వీక్లీ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ అదానీపై అభియోగాలకు సంబంధించి మాకు ఎలాంటి సమాచారం రాలేదని సమాధానం దాటవేసే యత్నం చేశారు. ఈ విషయంలో అమెరికాతో ఎలాంటి సంభాషణలు కానీ, సంప్రదింపులు కానీ భారత్ జరపలేదని చెప్పారు. అదానీ, ఆయన ఆరుగురి అధికారులకు సమన్లు, అరెస్టు వారెంట్లు అమెరికా కోర్టు జారీ చేసిందా అని విలేకరులు అడగ్గా, ఎలాంటి విజ్ఞప్తులు మాకు అందలేదని జైస్వాల్ ముక్త సరిగా సమాధానమిచ్చారు. అటువంటి అభ్యర్థన ఏదైనా వస్తే, దానిలో మెరిట్‌ను బట్టి చట్టపరమైన పరస్పర సహకార విషయం పరిశీలిస్తామని అన్నారు.

# దూసుకొస్తున్న ఫెంగల్ తుఫాను తమిళనాడులో భారీ వర్షాలు

చెన్నై: శనివారం మధ్యాహ్నానికి ఫెంగల్ తుఫాను పుదుచ్చేరికి దగ్గరగా రానుందని చెన్నైలోని ప్రాంతీయ వాతావరణ కేంద్రం(ఆర్.ఎం.సి) ప్రకటించింది. తీరం దాటే సమయంలో గంటకు 90కిమీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. శనివారం ఏడు తీరప్రాంత జిల్లాల్లో అత్యంత భారీ వర్షపాతాన్ని సూచించే రెడ్ వాతావరణ హెచ్చరికను ఆర్.ఎం.సి జారీ చేశారు. ఇతర జిల్లాల్లో కూడా భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఫెంగల్ తుఫాను కారణంగా భారీ వర్షాలు కురిసే జిల్లాల్లో మొత్తం 2,229 శిబిరాలు ప్రారంభించారు. నాగపట్నం, తిరువారూర్ జిల్లాలకు చెందిన 470 మందికి పైగా ప్రజలను ఆరు సహాయ శిబిరాలకు తరలించారు. ఫెంగల్ తుఫాను కారణంగా భారీ వర్షాలు కురిసే జిల్లాల్లో మొత్తం 2,229 శిబిరాలు తెరవబడ్డాయి. సముద్ర తీర ప్రాంత జిల్లాల్లో అధికారులు జారీ చేసిన సలహా మేరకు 4,100కు పైగా మత్స్యకార పడవలు తిరిగొచ్చాయి. కురిసిన వర్షానికి నేలకూలే చెట్లను తొలగించడానికి హైడ్రాలి, టెలిస్కోపిక్ పరికరాలతో సహా 489 ప్రత్యేక యంత్రాలను సిద్ధం చేశారు. రైల్వే వంతెన పనుల కోసం తాత్కాలికంగా మూసివేయబడిన గణేశపురం మినహా మిగిలిన 22 సబ్‌వేలు పని చేస్తున్నాయి. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ 329 సహాయ కేంద్రాలను సిద్ధం చేసింది. వాటిలో ఆహారం, నీరు మరియు పారిశుద్ధ్య సౌకర్యాలు ఉన్నాయి. 103 బోట్ల ద్వారా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అక్టోబర్ 15 నుంచి ఇప్పటి వరకు 2,615 వైద్య శిబిరాల ద్వారా 1.39 లక్షల మంది లబ్ధి పొందారు.



# ముప్పు నీడన ట్రంప్

అస్తానా : అమెరికా అధ్యక్షునిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికీ ముప్పు నీడనే ఉన్నారని రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్ వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచార సమయంలో ట్రంప్, ఆయన కుటుంబం అత్యంత అనాగరికమైన పద్ధతుల్లో దాడులను ఎదుర్కొనాల్సి వచ్చిందని ఆయన చెప్పారు. కలెక్టివ్ సెక్యూరిటీ ట్రియటీ ఆర్గనైజేషన్ (సిఎస్‌టిఓ) సదస్సు ముగింపు సందర్భంగా కజకస్తాన్ రాజధాని అస్తానాలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో పుతిన్ మాట్లాడారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయొంలో పదే పదే ట్రంప్‌పై హత్యా యత్నాలు చోటుచేసుకున్నాయని, చిన్నారులతో సహా ట్రంప్ కుటుంబాన్ని ఇలా రాజకీయ ప్రత్యర్థులు లక్ష్యంగా చేసుకున్నాయని, అయితే ట్రంప్ ఇప్పటికీ ముప్పు నీడనే ఉన్నారని పుతిన్ వ్యాఖ్యానించారు. ఇప్పటికీ ఆయనకు రక్షణ లేదన్నది తన ప్రగాఢ అభిప్రాయమని చెప్పారు. అనుభవజ్ఞుడు, మేథావి అయిన ట్రంప్ ఇలాంటి దాడలను జాగ్రత్తగా ఎదుర్కొగలరని పుతిన్ ఆశాభావం వ్యక్తం చేశారు. గత జులై 13న పెన్సిల్వేనియాలో ఎన్నికల ప్రచార సందర్భంగా ట్రంప్‌పై హత్యా యత్నం జరిగిన సంగతి తెలిసిందే.

# కాల్పుల విరమణ ఉల్లంఘనలు ఆపండి



బీరుట్ : హిజ్బుల్లాతో కుదుర్చుకున్న కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి ఇజ్రాయిల్ తాజాగా వైమానిక దాడికి పాల్పడిన నేపథ్యంలో ఇటువంటి ఉల్లంఘనలను ఆపేలా ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తేవాలని లెబనాన్ ప్రధాని నజీబ్ మికాతి కోరారు. ఫ్రెంచి అధ్యక్షులు మాక్రాన్‌తో ఫోన్‌లో మాట్లాడుతూ మికాతి ఈ విజ్ఞప్తి చేశారు. బుధవారం తెల్లవారు జాము నుండి కాల్పుల విరమణ అమల్లోకి వచ్చిన లెబనాన్‌లో తాజా పరిస్థితుల గురించి వారు మాట్లాడుకున్నారు. ఒప్పందం కుదిరేలా సహకరించినందుకు ఆయన మాక్రాన్‌కు కృతజ్ఞతలు తెలియచేశారు. ఒప్పందాన్ని ఉల్లంఘించి గురువారం జరిగిన దాడిలో గణనీయంగా నష్టం జరిగిందని, పలువురు గాయపడ్డారని మికాతి తెలిపారు. కాగా హిజ్బుల్లానే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ఇజ్రాయిల్ ఆర్మీ తెలిపింది. దక్షిణ లెబనాన్‌లో పలు ప్రాంతాల్లోకి వాహనాలు వచ్చాయని తెలిపింది. అందుకే తాము హెచ్చరికగా కాల్పులు జరిపామని వెల్లడించింది. అయితే తైబే గ్రామంపై ఇజ్రాయిల్ డ్రోన్‌తో జరిపినదాడిలో నలుగురు గాయపడ్డారని లెబనాన్ మిలటరీ తెలిపింది.

# చెన్నైఎయిర్‌పోర్టు మూసివేత



చెన్నై : ఫెంగల్ తుఫాను ప్రభావంతో కురుస్తోన్న భారీ వర్షాల కారణంగా.. చెన్నైలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. బలమైన ఈదురుగాలులు,

భారీ వర్షాల నేపథ్యంలో శనివారం సాయంత్రం 5 గంటల వరకు చెన్నై ఎయిర్‌పోర్ట్‌ను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఇప్పటికే శుక్రవారం నుంచి విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తమ సర్వీసులను రద్దు చేస్తున్నట్లు పలు ఎయిర్‌లైన్లు ప్రకటించాయి. కొన్ని విమానాలు ఆలస్యంగా నడిచాయి. తాజాగా ఎయిర్‌పోర్టులో కార్యకలాపాలను ఆపడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం సాయంత్రం నాటికి ఈ తుపాను తీరం దాటుతూ ఉధృతంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. దీంతో తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇప్పటికే సహాయక శిబిరాలను ఏర్పాటు చేసినట్లు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ వెల్లడించారు. తుపానును ఎదుర్కొనేందుకు సంసిద్ధత చర్యలను ఆయన దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. అటు పుదుచ్చేరిలోనూ భారీ వర్షాల కారణంగా సముద్రం ఉవ్వెత్తున ఎగసిపడుతోంది. అక్కడి ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని ప్రభుత్వం సూచించింది.

# తటస్థంగా వ్యవహరించాలి

న్యూఢిల్లీ: హింస, ప్రాణ నష్టం, అరెస్టులు, మతోన్మాద ఉద్రిత్తతలు నెలకొన్న నేపథ్యంలో పూర్తిగా తటస్థంగా వుంటూ శాంతి సామరస్యతలను కాపాడాల్సిందిగా ఉత్తరప్రదేశ్ పోలీసులకు, సంభాల్ జిల్లా యంత్రాంగానికి సుప్రీం కోర్టు శుక్రవారం కఠినమైన ఆదేశాలు జారీ చేసింది. 16వ శతాబ్దంలో ఆలయాన్ని ధ్వంసం చేసి దానిపై మసీదును నిర్మించారనే వాదనలను నిర్ధారించేందుకు సర్వే చేపట్టాల్సిందిగా సివిల్ కోర్టు ఉత్తర్వులు జారీ చేసిన తరుణంలో ఈ ఆదేశాలు వెలువడ్డాయి. కాగా, తమ ముందున్న కార్యకలాపాలను నిలిపివేయాల్సిందిగా సివిల్ కోర్టును ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజరు కుమార్‌లతో కూడిన బెంచ్ ఆదేశించింది. సివిల్ కోర్టు అడ్వకేట్ కమిషనర్ రూపొందించిన మసీదు సర్వే నివేదికను సీల్డ్ కవర్‌లో వుంచాల్సిందిగా సుప్రీం కోర్టు ఆదేశించింది. పిటిషనర్, మసీదును నిర్వహించే సంభాల్ షాహి జామా మసీద్ కమిటీపై సుప్రీం కోర్టు పలు చట్టపరమైన చర్యలు తీసుకుంది. సర్వే నిర్వహించాలని లేదా ఆదేశాలు సవరించాలని లేదా అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించాలని కోరుతూ నవంబరు 19న సివిల్ కోర్టు పరోక్షంగా ఇచ్చిన ఆదేశాలను తోసిపుచ్చేందుకు సివిల్ ప్రొసీజర్ కోడ్‌లోని 13వ నిబంధనలోని 9వ ఆదేశాల కింద కమిటీ పిటిషన్ దాఖలు చేయవచ్చని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఖన్నా చెప్పారు. కమిటీ దాఖలు చేసే పిటిషన్‌పై హైకోర్టు విచారించేవరకు ఎలాంటి కార్యకలాపాలను విచారణా కోర్టు చేపట్టరాదని బెంచ్ స్పష్టం చేసింది. సివిల్ కోర్టు ఆదేశాలపై పిటిషన్ దాఖలైతే మూడు రోజుల్లోగా దానిని విచారణాంశాల జాబితాలో చేర్చాలని కోరింది. ఈలోగా ఈ కేసులో ఎలాంటి పరిణామాలు జరుగుతున్నాయో సుప్రీం కోర్టు పర్యవేక్షిస్తూ వుంటుందని అధికారులు తెలుసుకోవాలని ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు. వచ్చే ఏడాది జనవరి 6తో ప్రారంభమయ్యే వారంలో కమిటీ పిటిషన్‌ను విచారణకు చేర్చాలని సీజేఐ ఆదేశించారు.

# తప్పుడు వార్తలపై కేరళ సిపిఎం లీగల్ నోటీసు

తిరువనంతపురం : ఎస్‌డిపిఐ మద్దతుతో రాష్ట్రంలోని నాలుగు స్థానిక ప్రభుత్వ సంస్థల్లో ఎల్‌డిఎఫ్ అధికారంలో ఉందని తప్పుడు వార్తను ప్రచురించిన మలయాళ మనోరమ దినపత్రికకు కేరళ సిపిఎం లీగల్ నోటీసు పంపింది. మలయాళ మనోరమ కంపెనీ, ప్రింటర్ అండ్ పబ్లిషర్ జాకబ్ మాథ్యూ, చీఫ్ ఎడిటర్ మమ్మన్ మాథ్యూ, ఎడిటర్ ఫిలిప్ మాథ్యూ, మేనేజింగ్ ఎడిటర్ జాకబ్ మాథ్యూ, ఎడిటోరియల్ డైరెక్టర్ జోస్ పనచిప్పురంపై కేరళ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి ఎంవీ గోవిందన్ లీగల్ నోటీసు పంపారు. తిరువనంతపురం నగరూర్ గ్రామ పంచాయతీ, పతనంతిట్ట మున్సిపాలిటీ, కొట్టంగల్ గ్రామ పంచాయతీ, నగరూర్‌లోని పాలక్కాడ్ ఒంగల్లూరు గ్రామ పంచాయతీలలో సీపీఐ(ఎం) అధికారంలో ఉందని నవంబర్ 26న వార్తలు వచ్చాయి. నగరూరు, ఒంగల్లూరులో ఎల్‌డీఎఫ్‌కు మెజారిటీ ఉంది. పతనంతిట్ట మున్సిపాలిటీలో ఇండిపెండెంట్లు ఎల్‌డిఎఫ్‌కు మద్దతు పలికారు. ఈ వాస్తవాలు, వివరాలపై స్పష్టత ఇవ్వకుండా మనోరమ ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా వార్తలు ఇచ్చిందని పేర్కొన్నారు.

# నరాల బలహీనతకు చెక్ పెట్టాలంటే జామ తినండి...

నరాల బలహీనత ఏర్పడటానికి చాలా రకాల కారణాలు ఉంటాయి.నరాలు పట్టుత్వం కోల్పోయి ఏ పని చేయలేరు నరాలు బలహీనంగా అయినప్పుడు శరీరం అంతా శక్తి విహీనంగా మారుతుంది. అలాగే ఏ పని చేయలేక చాలా ఇబ్బంది పడుతూ ఉంటారు. మానసికంగా కృంగిపోతూ ఉంటారు. ఇలాంటి నరాల బలహీనతకు చెక్ పెట్టాలంటే జామ పండు చాలా అద్భుతంగా పనిచేస్తుంది జామ పండు అంటే చిన్న పిల్లల నుండి పెద్దవారి వరకూ చాలా ఇష్టంగా తింటారు. రోజుకి ఒక జామకాయ లేదా జామకాయ జ్యూస్ తాగితే వాటిలో ఉండే పోష కాలు నరాల బలహీనత కండరాల బలహీనత రెండింటిని దూరం చేస్తాయని నిపుణులు చెబుతున్నారు కాబట్టి నరాల బలహీనత రోజుకు ఒక జామ పండు తింటే మంచిది అలాగే జామ పండు తింటే చాలా ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి డయాబెటిస్ ఉన్నవారు దోరగా ఉన్న జామ పండు తింటే రక్తంలో చక్కెర స్థాయి నియంత్రణలో ఉంటాయి. నిమ్మ కంటే జామ పండులో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది ఈ విషయం చాలా మందికి తెలియదు విటమిన్ సి కావాలి అంటే నిమ్మకాయల వెంట పరిగెడుతూ ఉంటారు కానీ జామపండులో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది ఈ విటమిన్ సి శరీరంలో రోగ నిరోధక శక్తి పెంచడానికి సహాయపడుతుంది



అంతే కాకుండా బరువు తగ్గటానికి సహాయం చేస్తుంది. చాలామంది పచ్చిగా ఉన్న జామకాయలు తింటూ ఉంటారు. అలా తినకూడదు దోరగా ఉన్న జామ కాయలు లేదా బాగా పండిన జామ కాయలు మాత్రమే తినాలి. పచ్చి జామకాయ తింటే వాటిలో ఉండే ఫాస్పరస్, ఆక్సాలిక్ ఆమ్లం కడుపునొప్పి ఇతర అనారోగ్య సమస్యలకు దారితీస్తుంది కాబట్టి పచ్చి జామకాయ తినడం ఆరోగ్యానికి ప్రమాదమే.

# ప్లాస్టిక్ కప్‌లో టీ తాగుతున్నారా?

ఇప్పుడు ప్రపంచం మొత్తం ప్లాస్టిక్ మీద ఆధారపడి ఉంటుంది..ఎటువంటి వాటికి కొనాలన్నా , తీసుకోవాలని అన్నా కూడా ప్లాస్టిక్ బ్యాగులను వాడటం మామూలు అయిపోయింది. హోటల్ యాజమాన్యాలు అయితే తాగే నీళ్ళ నుంచి తినే వాటి వరకు అన్నిటినీ ప్లాస్టిక్ కవర్లలో సప్లై చేస్తుంటారు..కానీ ఇపుడు కాఫీని , టీ ను ప్లాస్టిక్ కప్ లలో తాగడం వల్ల ఆరోగ్యానికి చాలా హాని కలుగుతుందని నిపుణులు అంటున్నారు .

. అయితే ప్లాస్టిక్ వాటిలో ఆహారాన్ని తీసుకోవడం వల్ల ఎటువంటి హానీ కలుగుతుందో ఇప్పుడు చూద్దాం.. ఈ కప్స్ లోపల ఒక లైనింగ్ ఉంటుంది, ఈ లైనింగ్ ఈ కప్ ని వాటర్ ప్రూఫ్ చేస్తుంది. ఇది ఆరోగ్యానికి హాని చేయడమే కాదు, ఎన్విరాన్మెంట్ కి కూడా హాని చేస్తుంది, శరీరంలో కొన్ని రకాల హానికారక కెమికల్స్ ను కూడా విడుదల చేస్తాయి..ఈ కప్పులలో వేడి వాటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల ఎటువంటి దుష్ప్రయోజనాలు ఉన్నాయో పరిశోధనలు చేసి నిరూపించారు. 100 మిల్లీ లీటర్ల కప్పులలో వేడి నీరు పోసి పదిహేను నిమిషాలు ఉంచారు. ఆ తరువాత ఈ వేడి నీటిని ఒక స్ట్రాంగ్ మైక్రో స్కోప్ కింద పరీక్ష చేశారు. అప్పుడు ఒక్కొక్క కప్ లో సుమారుగా ఇరవై ఐదు వేల మైక్రో ప్లాస్టిక్స్ ఉన్నట్లుగా కనుగొన్నారు. ఈ నీటిలో హాని కారక లోహాలైన జింక్, లెడ్, క్రొమియం కూడా ఉన్నట్లు కనుగొన్నారు. ఈ పరిశోధన చేసిన వారు చెప్పిన దాని ప్రకారం ఈ విషపదార్థాలు కప్ లోపల ఉన్న



పొర విడిపోయినట్లు నిరిపించారు.. పార్టికిల్స్ ఒక మైక్రాన్ అంత పెద్దగా ఉన్నాయి. ఒక వ్యక్తి సుమారుగా రోజుకి మూడు సార్లు ఇలాంటి కప్ లో నుండి టీ, లేదా కాఫీ తాగితే ఆ వ్యక్తి ఒక రోజులో డెబ్బై ఐదు వేల చిన్న మైక్రో ప్లాస్టిక్ పార్టికల్స్ ని తీసుకున్నట్లు అవుతుంది.మైక్రో ప్లాస్టిక్స్ హాని కారక లోహాలైన పెలాడియం, క్రోమియం, కాడ్మియం వంటివి కలుస్తాయి. ఇవి రెగ్యులర్ గా లోపలికి వెళ్తుంటే కొంత కాలం తరువాత సీరియస్ హెల్త్ కాంప్లికేషన్స్ వస్తాయట..అందుకే ప్లాస్టిక్స్ కు చాలా దూరం ఉండాలని నిపుణులు అంటున్నారు.. ఇకమీద నుంచైనా ప్లాస్టిక్ ను దూరంగా ఉండటం మేలు..

# మంచి ఆహారం తినకపోతే...



మీరు తినే ఆహారంలో కూరగాయలు, ఆకు కూరలతో పాటూ ఫ్రూట్స్, డ్రైఫ్రూట్స్, పప్పులు, గింజల వంటివి కూడా ఉంటాయా? అలా ఉంటే మీకు బైపోలార్ డిజార్డర్ రాదు. అలాకాకుండా... ఎక్కువగా జంక్ ఫుడ్ తింటూ బ్యాలెన్సింగ్ డైట్ తినకపోతే అలాంటి వారికి ఈ మానసిక సమస్య వస్తోంది. బైపోలార్ డిజార్డర్‌ను ఇదివరకు మానిక్ డిప్రెషన్ అనేవారు. ఇది పని ఒత్తిడి ఎక్కువగా ఉండే వారికి వస్తూ ఉంటుంది. లేదంటే... ప్రేమించిన వాళ్లు దూరమైన, అయిన వాళ్లు చనిపోయినా, ఒంటరి జీవితాన్ని అనుభవిస్తున్నా, మత్తు పదార్థా లకు బానిసైనా అలాంటి వాళ్లు బైపోలార్ డిజార్డర్ లోకి జారుకుంటారు. ఓవైపు ఒత్తిడి, మరో వైపు కుంగుబాటు తనం రెండూ ఒకే సమయం లో వచ్చే వారికి ఈ బైపోలార్ డిజార్డర్ వస్తుంది. ఇది వచ్చినవాళ్లు తాము ఒంటరైపోయినట్టు ఫీలవుతారు. తమకు ఈ ప్రపంచంతో సంబంధం లేదన్నట్టు భావిస్తారు. చీకట్లో కూర్చొని కుమిలిపోతారు. ఒక్కోసారి ఆత్మహత్య చేసుకోవాలనుకుంటారు. చేసుకుంటున్నవాళ్లూ ఉన్నారు. ఎక్కువగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఈ డిజార్డర్ వచ్చి ప్రాణాలు తీసుకుంటున్నారు.

ఈ సమస్య ఉన్న వాళ్లు దీన్ని పోగొట్టుకోవాలి. అలాగే లేనివాళ్లు ఇది రాకుండా చేసుకోవాలి. ఇందుకు మంచి ఆహారం తినడమే సరైన మందు అంటున్నారు డాక్టర్లు. మంచి ఆహారం తీసుకునే వారికి ఈ మానసిక సమస్య రాదని తేల్చారు. ఈ సమస్య ఉన్న వారికి ప్రస్తుతం న్యూట్రాస్యూటికల్ ట్రీట్‌మెంట్ అనేది చేస్తున్నారు. అధిక బరువు ఉన్న వారు కూడా జాగ్రత్త పడాలి. ఎందుకంటే... ఈ సమస్య వచ్చిన వారిలో చాలా మంది అధిక బరువు కలిగివుంటున్నారంట. మన శరీరానికి ఏ గాయమో అయితే వెంటనే తగ్గించగలరు గానీ... మానసిక సమస్యలు, డిజార్డర్ల వంటివి ఉంటే మాత్రం వెంటనే తగ్గించలేరు. ముఖ్యంగా బైపోలార్ డిజార్డర్ ఉన్నవారు ఒంటరితనాన్ని వదిలేయాలి. ఫ్రెండ్స్, కుటుంబ సభ్యులు, బంధువులు, తెలిసిన వాళ్లతో మాట్లాడాలి. ఏదేదో అనుకుంటూ అదే పనిగా ఫీలవ్వడం మానేసి తమకు ఇష్టమైన ఇతర పనుల్లోకి జారుకోవాలి. ఇలా చేయడం వల్ల ఒంటరి ఆలోచనలకు దూరం కావొచ్చు. రోజూ వ్యాయామం, వాకింగ్ వంటివి చెయ్యాలి. అదే సమయంలో మంచి ఆహారం తీసుకుంటే... మెదడు, శరీరం అన్నీ చక్కగా చురుగ్గా ఉంటూ బైపోలార్ డిజార్డర్‌ను దూరం చేస్తాయి.

# చేపలు ఆరోగ్యానికి ఎంత మంచివో తెలుసుకోండి..!

## -గుండె జబ్బులు మటు మాయం...!!

చేపల కూర గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. చేప కూర వాసన కె నోట్లో నీళ్లూరుతాయి. అంతలా గుమ గుమ లాడిపోతుంది చేప కూర.చేపలు కూర అంటే చాలు.. మాంసాహారులు లొట్టలేసుకుని మరి ఫుల్ గా లాగించేస్తారు. చాలామంది మాంసం తినడం కంటే చేపలను తినడానికే ఎక్కువ ఇష్టపడతారు. మరి,

చేపలు తినడం ఆరోగ్యానికి మంచిదేనా? దీనిపై తాజా పరిశోధనలో తేలిన ఈ ఆసక్తికర విషయాలు గురించి తెలిస్తే.. మీరు తప్పకుండా ఆశ్చర్యపోతారు. మరి ఆ ఆసక్తికరమైన విషయాలు ఏంటో ఇండియా హెరాల్డ్ అందిస్తున్న ఈ ఆర్టికల్ లో చదవండి... చేపలు గుండె జబ్బు వున్న వాళ్ళు తింటే వాళ్ళ ఆరోగ్యానికి చాలా మంచిదని పరిశోధనలో వెల్లడయింది. చేపలు తినడం వల్ల గుండె సంబంధిత వ్యాధులకు దూరంగా ఉండవచ్చని అమెరికన్ హార్ట్ అసోసియేషన్ నిర్వహించిన ఓ అధ్యయంలో తేలింది.



మాలిక్యులార్ న్యూట్రిషన్ అండ్ ఫుడ్ రిసెర్చ్, న్యూట్రిషనల్ బయోకెమిస్ట్రీ జర్నల్స్‌లోనూ ఈ విషయాన్ని ప్రధానంగా ప్రస్తావించడం జరిగింది. చేపలను తినడం వల్ల గుండె జబ్బులు దూరమవుతాయని ఆయా కథనాల్లో స్పష్టంగా పేర్కొనటం జరిగింది...

చేపల్లో చాలా రకాలు ఉంటాయి. అయితే, మీరు ఒమెగా 3 ఫ్యాటీ ఆమ్లాలు అధికంగా ఉండే మాకరెల్, సాల్మన్, హెర్రింగ్, లేక్ ట్రౌట్, సార్డిన్స్, అల్బాకోర్ ట్యూనా రకానికి చెందిన చేపలను తీసుకుంటే మంచిదని నిపుణులు తెలుపుతున్నారు.

అలాగే.. వారంలో కనీసం రెండుసార్లు చేపలను తీసుకుంటే మంచి ఫలితం ఉంటుందట.

లేదా వారానికి కనీసం 100 గ్రాముల వరకు ఉడకబెట్టిన, లేదా వేయించిన చేపలను తినడం ఉత్తమం.శరీరంలోని చెడు కొవ్వులను బయటకు పంపేసే ఒమెగా 3 ఫ్యాటీ ఆమ్లాలు చేపల్లో సమృద్ధిగా ఉంటాయట. దీని వల్ల శరీరంలో కొవ్వు అతిగా పేరుకుపోదు. దీంతో రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోయే పరిస్థితులు తగ్గుముఖం పడతాయి. ఫలితంగా గుండె జబ్బులు వచ్చే అవకాశం ఉండదు.

# రోజూ గుప్పెడు వాల్‌నట్స్‌తో గుండె సమస్యలు దూరం


వాల్‌నట్స్ నిజానికి ఇతర నట్స్ లా అంత రుచికరంగా ఉండవు. అందువల్ల వీటిని చాలా మంది తినేందుకు ఇష్టపడరు. కానీ సైంటిస్టులు చెబుతున్న ఓ విషయం తెలిస్తే మీరు రోజూ వాల్ నట్స్ ను కచ్చితంగా తింటారు. అదేమిటంటే.. నిత్యం గుప్పెడు వాల్ నట్స్ ను తినడం వల్ల గుండె జబ్బులు రావని వారు తెలిపారు. ఈ మేరకు వారు తాజాగా ఓ పరిశోధన చేపట్టారు. హాస్పిటల్ క్లినిక్ ఆఫ్ బార్సిలోనా, లోమా లిండా యూనివర్సిటీలకు చెందిన పరిశోధకులు 600 మందిని రెండు గ్రూపులుగా విభజించారు. ఒక గ్రూపు వారికి నిత్యం 30 నుంచి 60 గ్రాముల వరకు వాల్‌నట్స్ ను తినమని చెప్పారు. మరొక గ్రూప్ వారికి వాల్ నట్స్‌ను తినవద్దని సూచించారు. 2 ఏళ్ల పాటు సుదీర్ఘంగా వారిని పరిశీలించారు. ఈ క్రమంలో సైంటిస్టులు గుర్తించిందేమిటంటే.. నిత్యం వాల్ నట్స్ ను తిన్నవారికి గుండె జబ్బులు వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయని తేల్చారు. వాల్‌నట్స్‌లో ఉండే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, ఆల్ఫా లినోలినిక్ యాసిడ్ తదితర పోషక పదార్థాలు గుండె జబ్బులు రాకుండా చూస్తాయని నిర్ధారించారు. అందువల్ల నిత్యం గుప్పెడు వాల్ నట్స్ ను తినడం వల్ల గుండె జబ్బులు రావని సైంటిస్టులు చెబుతున్నారు.

# భుక్తిముక్తులనిచ్చే అపూర్వ ధామం కాళేశ్వరం

కార్తీకమాసంలో ప్రతిరోజూ పర్వదినమే. అయితే ఈ మాసం నెలరోజులు చేసే పూజలన్నింటి కంటే కార్తీక పౌర్ణమి నాటి పూజకు ఫలితం అధికమంటారు. అగ్నితత్త్వ మాసమైన కార్తీకంలో వచ్చే పౌర్ణమికి చంద్రుని విశేషంగా ఆరాధించాలని మన పూర్వులు చెబుతారు. చంద్రుని కొలవడంలో మానసిక చైతన్యం, కుటుంబ శ్రేయస్సు, భార్యాభర్తల మధ్య సఖ్యత, సంతాన సౌభాగ్యం కలిగి ప్రశాంతత ఏర్పడుతుంది. ఈ మాసంలో శివాలయాలు భక్తులతో కిటకిటలాడుతాయి. భక్తి శ్రద్ధలతో భక్తులు పలు శైవ క్షేత్రాలను దర్శించుకుంటారు. కాళేశ్వర మహాక్షేత్రం ముక్తీశ్వర సమన్వితం కాళేశ్వరో మహాదేవో భుక్తిం ముక్తిం ప్రదాస్యతి!! అంటూ భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో పిలుచుకునే దేవుడు పరమ శివుడు. బోళా శంకరుడిగా, ఆదియోగిగా పూజలందు కుంటున్న ఈ స్వామి కాళేశ్వర ముక్తీశ్వర నామధేయంతో కొలువుదీరిన అపురూప ధామం కాళేశ్వరం. కరీంనగర్ జిల్లా మహదేవ్ పూర్ మండలంలో గోదావరి, ప్రాణహిత నదులు అంతర్వాహినిగా సరస్వతీ నది ప్రవహిస్తున్న త్రివేణీ సంగమ ప్రదేశంలో స్వయంభువుగా వెలసిన స్వామి శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి. ప్రశాంతమైన వాతావరణం, ప్రకృతి సోయగాల మధ్య అలరారుతున్న అతి పురాతనమైన ఈ ఆలయం ఒకప్పుడు అరణ్యంలో ఉండటం వల్ల రవాణా సౌకర్యం ఉండేదికాదు. అయితే 1976?82 సంవత్సరాల మధ్య కాలం లో ఆలయ జీర్ణోద్ధరణ పనులు జరగడంతో రవాణా వసతి సౌకర్యాలు మెరుగుపడ్డాయి. విశాలమైన ప్రాంగణంలో అలరారుతున్న ఈ దివ్యాలయం నాలుగు వైపుల నాలుగు నంది మూర్తులు దర్శనమిస్తాయి. ఇతర ఆలయాలకు మల్లే కాకుండా ఇక్కడ గర్భాలయంలో ఒకే పానమట్టం మీద రెండు లింగాలు ఉండటమే కాక ముక్తీశ్వర స్వామికి రెండు నాసికా రంధ్రాలుంటాయి. ఈ రంధ్రాలలో అభిషేక జలం ఎంత పోసినప్పటికీ ఒక్కచుక్క కూడా బయటకు రాకుండా భూమార్గం గుండా ప్రవహించి, సరస్వతీ నది రూపంలో గోదావరి ప్రాణహిత నదుల సంగమంలో కలుస్తుందని ఆలయ చరిత్ర చెబుతోంది.

గర్భాలయంలో ఉన్న రెండు లింగాలలో ఒకటి కాళేశ్వర లింగం కాగా, రెండవది ముక్తీశ్వర లింగంగా చెబుతారు. కాళేశ్వర లింగాన్ని యమధర్మరాజు ప్రతిష్టించాడు. మహాశివుడు యమధర్మరాజుకిచ్చిన వరం కారణంగా, ఈ ఆలయానికి వచ్చిన భక్తులు ముందుగా కాళేశ్వరలింగాన్ని దర్శించి అనంతరం ముక్తీశ్వర లింగాన్ని దర్శించాలన్న నియమం ఉంది. ఈ ఆలయం ఏటా మహాశివ రాత్రి ఉత్సవాలతో సహా పండుగలు, పర్వదినాలు, కార్తీక మాసాలలో భక్తులతో పోటెత్తుతుంది. ఆయా రోజుల్లో స్వామి వార్లకు మహాన్యాసక రుద్రాభిషేకాలు, అర్చనాది అభిషేకాలు ఘనంగా నిర్వహిస్తారు.

ఇక్కడ పార్వతీమాత శుభానంద దేవిగా



కొలుపులందుకుంటోంది. ఇదే ఆలయ ప్రాంగణంలో మరో పక్క మహాసరస్వతి ఆలయం ఉంది. ఇక్కడ అమ్మవారు ప్రౌఢసరస్వతిగా నీరాజనాలందుకుంటోంది.ఆలయంలో మరో పక్క ప్రధాన ద్వారానికి ముందు భాగంలో సూర్య దేవాలయం ఉంది. ఇంకోపక్క విజయ గణపతి కొలువుదీరాడు. విశాలమైన ఆలయ ప్రాంగణంలో స్వామి వారి ఆలయానికి ముందు భాగంలో కోనేరు ఒకటి ఉంది. ఈ కోనేరులో స్నానమాచరించిన వారికి కాశీలోని మణికర్ణికా ఘాట్‌లో స్నానమాడిన ఫలితం దక్కుతుందంటారు. ప్రధానాలయ ఆవరణలో యమకోణం ఉంది. ఈ ప్రాంగణంలోనే యముడు తపస్సు చేసినట్లు చెబుతారు. ఈ యమకోణ ప్రవేశం చేసే వారికి యమ బాధలుండవని, ముక్తికలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వార్ల ఆలయానికి ఒక కిలోమీటరు దూరంలో ఆది ముక్తీశ్వర స్వామి ఆలయం ఉంది. ఆది ముక్తీశ్వర స్వామి దర్శనం సర్వపాపహరణం. కాశీలో మరణిస్తే కైలాసప్రాప్తి కలుగుతుందని చెబుతారు. కాని ఈ క్షేత్రంలో శ్రీ కాళేశ్వర ముక్తీశ్వరుని దర్శిస్తేనే కైలాస ప్రాప్తి కలుగుతుందన్నది స్థలపురాణం.

# పాత వాటిని పదిలపరచుకోండిలా...

కరోనా వైరస్‌కు చలికాలంలో ఆటలు ఆడటమంటే సరదా! ఎండాకాలంలో ఎండకు కరిగిపోతాననే భయం ఉంటేనే అంత మందిని బలి తీసుకున్నది. మరి ఇప్పుడు దానికి అనుకూలమైన కాలం. చలిలో చక్కగా మనుగడ సాగించగలదు. కాబట్టి మనం ఇంతకు ముందుకన్నా జాగ్రత్తగా ఉండాలి. చాపకింద నీరులా, నివురు గప్పిన నిప్పులా సమయం కోసం వేచి చూస్తున్నది కరోనా వైరస్. సెకండ్ వేవ్‌తో కొన్ని దేశాలు ఇప్పటికే విలవిల లాడుతున్నాయి. మళ్ళీ లాక్‌డౌన్‌కు వెళ్ళాల్సి వచ్చేలా ఉందని ఆలోచిస్తున్నాయి. మన దేశానికి కూడా ఆ పరిస్థితి రాకుండా ఉండాలంటే స్వీయ సంరక్షణా చర్యలు పాటించాలి. గత నెలలో వైరస్ ప్రభావం తగ్గుముఖం పట్టిందనే వార్తలు వచ్చిన నేపథ్యంలో చాలామంది మాస్కులు, భౌతిక దూరాలను తుంగలో తొక్కేశారు. వాయు కాలుష్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో కరోనా ప్రభావం ఎక్కువగా ఉంటుందనీ, తద్వారా మరణాల శాతం పెరగవచ్చని శాస్త్రవేత్తల అంచనా. అగ్రదేశాలు పడుతున్న సమస్యల్ని చూసైనా మనం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉన్నది. అప్రమత్తతగా వ్యవహరించకపోతే ప్రమాదం వైపు పరుగులు పెట్టినట్టే అవుతుంది. కాబట్టి మాస్కుల ధారణ, శానిటైజర్, భౌతిక దూరం వంటికి కచ్చితంగా పాటించాలి.ఇపుడు అందరూ ఆన్‌లైన్ షాపింగ్ చేస్తున్నారు కదా! అమెజాన్, ఫ్లిప్‌కార్డులలో వస్తువులు నేరుగా ఇంటికే వస్తున్నాయి. ఆ వస్తువులను పగిలిపోకుండా, డ్యామేజీ కాకుండా తగు జాగ్రత్తలతో అట్టల ప్యాకింగులతో సులభంగా ఇంటికి చేరవేస్తున్నారు. ఆ అట్టలు గట్టిగా చక్కగా ఉంటాయి. అలాంటి అట్టల్ని బొమ్మలకు వాడుకోవచ్చు. ప్రస్తుతం నేను తయారు చేసింది మాత్రం గట్టిగా ఉన్న పెండ్లి శుభలేఖను. ఈ అట్టను మౌస్ ప్యాడ్‌గా వాడుతున్నాను. అలాంటి గట్టి అట్టమీద ఒక రంగు పేపర్ అతికించాలి. నేను ఒక పాప బొమ్మను వేసుకున్నాను. దానికి రంగులు వేశాను. ఈ పాప బొమ్మను గట్టి అట్టపై అతికించాను. మౌస్‌ప్యాడ్ అందంగా తయారైంది. ఇలా మన చేతితో వేసిన రంగుల చిత్రంతో మౌస్ ప్యాడ్ అందంగా తయారైంది. మరి వెరైటీగా మౌస్‌ప్యాడ్ ఎంత అందంగా ఉందో చూశారా!మొదటగా రంగు రంగుల పాత గుండీలను సేకరించాను. ఈ కాలంలో ప్రతి ఇంట్లోనూ ఎన్నో రకాల డ్రెస్సులు మూలబడి ఉంటు న్నాయి. అలాంటి పాత బట్టలకున్న రంగు రంగుల, చిన్నా పెద్దా గుండీలను కత్తిరించి దాచుకుంటే అవసరానికి బొమ్మలకు పని కొస్తాయి. నేను కరోనా కాలంలో ఐదవ విడత లాక్‌డౌన్ విధించి నపుడు ఈ బొమ్మను తయారు చేశాను. నేను మొదటగా గుండీలతో ఒక ఇల్లు ఆకారాన్ని అమర్చాను. ఫెవికాల్‌తో గుండీలను అట్టమీద ఇంటి ఆకారంలో అతికించాను. ఇంటి మధ్యలో ఒక తాళాన్ని పెట్టాను. లాక్‌డౌన్ అంటే ఇంట్లో ఉండాలనే కదా అర్థం. అందుకే ఇంటికి తాళం వేశాను. తర్వాత పక్కనే ఐదు అని రాశాను. రాయడమంటే గుండీలతో 5 అకారంలో అతికించటం. ఈ ఇంటి చుట్టూ పూలను పెట్టాను. ఇల్లంటే కొన్ని పూల మొక్కలుండాలి కదా! అందుకే పూలను పెట్టాను. మొత్తంగా లాక్‌డౌన్ చిత్రం తయారైంది.మొదట రాఖీల బాక్సులు అవసరం పడలేదు నాకు. నేను వాటర్ యాంపుల్స్‌తోనే బొమ్మలు చెయ్యాలనుకున్నాను. ఎందుకంటే అప్పుడు నేను బాటిల్స్ మీద ఆర్ట్ వేస్తున్నాను. మంచి నీళ్ళు, మంచి నూనెల సీసాలతో పాటు సెలైన్ సీసాలూ ఆర్ట్ కోసం ఉపయోగించాను. ఇంకా ఇంజక్షన్ బుడ్లు కూడా అలంకారంలో భాగంగా వినియోగించాను. ఇంకా చిన్నవి ఏమైనా ఉన్నాయా అని వెతుక్కుంటున్నపుడు ఈ వాటర్ యాంపుల్స్ నా దృష్టికొచ్చాయి. వాటర్ యాంపుల్ అంటే ఇంజక్షన్ చేయాల్సిన మందుపొడిలోకి నీళ్ళను కలపటానికి వాడే చిన్న ప్లాస్టిక్ బాటిల్ లాంటిది. నేను దీనికి బాటిల్ హౌదానిచ్చి అలంకారం చేశాను. బాటిల్ ఆర్ట్‌లో భాగంగా వీటన్నింటినీ పెయింట్ చేశాను. ఇప్పుడు ఈ బుజ్జి బాటిళ్ళను ఎలా సేఫ్టీగా పెట్టాలా అని ఆలోచించినపుడు మాత్రమే నాకీ రాఖీల బాక్సులు కనిపించాయి. నేను ఈ బాక్సుల్ని తీసుకొని ఒక్కొక్క బాక్సులో రెండు రెండు బాటిళ్ళను పెట్టాను. అలా చూస్తే ఫ్రిజ్‌లో పెట్టిన బాటిల్స్‌కు మినియేచర్ రూపాల్లా అనిపించాయి. గ్లాస్‌డోర్లలో ఉన్న అందమైన బాటిల్స్ ముద్దుగా కనిపిస్తున్నాయి. ఇంకా ఎలా కనిపించాయంటే - రిలయన్స్, డి-మార్ట్ లాంటి ప్రొవిజనల్ స్టోర్స్‌లో కూల్‌డ్రింగ్ బాటిల్స్ అన్నీ ఒక బీరువాలాంటి షెల్ఫ్‌లో ఉంటాయి. అలా కనిపించింది దీన్ని చూస్తున్నపుడు.

బైక్ ఏదో చిన్న రిపేర్ వచ్చిందని మా అబ్బాయి రిపేరు షాపుకు వెళ్ళాడు. అక్కడ అతను రిపేరు చేస్తుండగా చిన్న కాఫీ గ్లాసులాంటి ఇనుప ఆకారం ఒకటి అక్కడ పడి ఉండటం చూశాడు. షాపు అతన్ని అడగగా పనికి రానిదని చెప్పగానే దాన్ని ఇంటికి తెచ్చాడు. లోతుగా గుంటలా ఉన్నది. పైనున్న భాగం కోసుకునేలా లేకుండా నున్నగా ఉన్నది. కింది వైపు కొద్దిగా స్టాండువలె ఉన్నది. కాబట్టి ఎక్కడ నిలబెట్టినా నిలబడేలా ఉన్నది. వెంటనే దానికి నల్ల రంగును వేశాను. దాని తర్వాత బంగారు రంగుతో బార్డర్లు వేశాను. అడుగున ఉండే బేస్‌కూ బంగారు రంగు వేశాను. మధ్యలో భాగానికి ఎరుపు రంగును వేసి దానిపై తెలుపు రంగు చుక్కల్ని పెట్టాను. ఇదంతా చేసే సరికి చాలా చక్కగా కనిపించింది. ఇంత చక్కగా ఉన్న దీనిలో ఏం పెట్టుకోవచ్చా అని ఆలోచించగా టూత్‌పిక్స్ పెట్టుకోవడానికి బాగుంటుందనిపించింది. చక్కని అలంకారం ఉన్న టూత్‌పిక్ హౌల్డర్ తయారయింది.డెయిరీ మిల్క్ చాక్లెట్లు, జెమ్స్ అన్నీ కలిపి ఒక బాక్సులో ప్యాక్ అయి వస్తాయి. ఇంకా అమెరికా, లండన్‌ల నుంచి వచ్చే చుట్టాలు ఇండియాలో ఉన్న బంధువుల కోసం గిఫ్ట్‌లుగా చాక్లెట్లే తెస్తుంటారు. చాక్లెట్ల రుచి ఏమోగానీ నాకు చాక్లెట్ ప్యాక్‌లే నోరూరిస్తుంటాయి. బంగారు రంగు, కాఫీ రంగులతో చాక్లెట్లు పెట్టే గుంటలతో రకరకాల ఆకారాలతో ఆకర్షణీయంగా ఉంటాయి. త్వరగా చాక్లెట్లు ఎవరికో ఒకరికి ఇచ్చేసి మిగిలిన ట్రేలు దాచుకుంటాను. ఈ ట్రేలతో చాలా బొమ్మలు చేశాను. మీక్కూడా చూపించాను. ఈ సారి కొద్ది వెరైటీగా చేద్దాం. ఇది చాలా చిన్న చాక్లెట్ బాక్స్. నాలుగు అరలు మాత్రమే ఉన్నాయి. ఇందులో నాలుగు జెమ్స్ ప్యాకెట్లే వచ్చాయి. ఈ బాక్స్‌లోని నాలుగు అరల్లో నలుగురు మనుషుల్ని నిలబెట్టాను. గది కొకరిని కాపలాగా పెట్టాను. మనుషులు ఎలా వచ్చారు? గుండె జబ్బులకు వాడే టాబ్లెట్ల డబ్బాలలో ఇలాంటి ప్లాస్టిక్ మూతలుంటాయి. అవి పింక్ రంగులో చాలా ముచ్చటగా ఉంటాయి. వాటికి కండ్లు, ముక్కు, నోరు పెట్టి మనుషులుగా ప్రాణ ప్రతిష్ట చేశాను. మరి ఈ ప్లాస్టిక్ మనుషులు చాక్లెట్ అరల్లో చాక్లెట్లు దొంగిలించకుండా కాపలా ఉన్నారు.

Editor, printed and owned by Bommarboyina Venkanna, Associate Editor K Rajendra Prasad “office: Amber Nagar, Parshigutta, Secundrabad, Cell.no: 099592 36324, 9912824332